సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
గురువారం, 12.02.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 112
పేజీలు: 12 వెల: రూ. 5

# డబుల్ ధమాకా
## రెండు సూపర్ ఓవర్ల యుద్ధం

- ఉత్కంఠ పోరులో దక్షిణాఫ్రికా వీరోచిత విజయం!
- పోరాడి ఓడిన అఫ్గాన్
- క్రికెట్ చరిత్రలో నిలిచిపోయే 'నరాలు తెగే' సమరం!
- వణుకు పుట్టించిన అఫ్గాన్.. తృటిలో చేజారిన గెలుపు
- సీజన్‌లో 'ది బెస్ట్' మ్యాచ్!

11

టీ20 క్రికెట్ చరిత్రలోనే కళ్లు చెదిరే సంచలనం! ఒక్క పరుగు కోసం పోరాటం.. ఒక్క వికెట్ కోసం ఆరాటం.. వెరసి మైదానంలో పరుగుల వర్షం, భావోద్వేగాల ప్రవాహం. బుధవారం దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్ క్రికెట్ ప్రేమికులకు ఊపిరి బిగబట్టేలా చేసింది. గెలుపు ఇరు జట్ల మధ్య దోబూచులాడింది. నిర్ణీత ఓవర్లలో స్కోర్లు సమం కావడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీయగా, అక్కడ కూడా ఫలితం తేలకపోవడంతో రెండో సూపర్ ఓవర్ (డబుల్ సూపర్ ఓవర్) నిర్వహించాల్సి వచ్చింది. చివరి బంతి వరకు సింహంలా పోరాడిన అఫ్గానిస్తాన్ జట్టుపై, అపార అనుభవంతో దక్షిణాఫ్రికా 4 పరుగుల తేడాతో విజయం సాధించి ఊపిరి పీల్చుకుంది. ఈ సీజన్‌లో ఇది అత్యుత్తమ మ్యాచ్‌గా నిలిచిపోయింది.




# పోలింగ్ ప్రశాంతం
## ఉత్సాహంగా ఓటేసిన పుర ప్రజలు

ప్రధాన పార్టీల మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు | పలు చోట్ల ఉద్రిక్తతలు

- కరీంనగర్ లో పోలీసుల లాఠీచార్జి, బీజేపీ ఆందోళన
- కరీంనగర్ దొంగ ఓటు వేసేందుకు విఫలయత్నం
- ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ పోలింగ్ బూత్ కు కత్తితో వచ్చిన మహిళ
- నిజామాబాద్ లో ఏసీపీ, కానిస్టేబుల్ కు ఎంపీ ధర్మపురి క్లాస్
- సంగారెడ్డి పట్టణం 34వ వార్డులో సీఐపై విరుచుకుపడ్డ జగ్గారెడ్డి
- బోధన్ పట్టణంలో ఎంఐఎం, బీఆర్ఎస్ శ్రేణుల బాహాబాహీ
- భూపాలపల్లిలో రోడ్డుపైనే నోట్ల కట్టలు విసిరిన వ్యక్తి అరెస్ట్
- నర్సంపేట మున్సిపాలిటీలో డబ్బులు పంచుతూ పట్టుబడ్డ వ్యక్తి
- జనగామ మున్సిపాలిటీలో ఓటు కోసం డబ్బులివ్వలేదంటూ మహిళల ఆందోళన
- కరీంనగర్ లో ఎన్నికల సిబ్బందిపై పిచ్చి కుక్కల దాడి
- కొడంగల్‌లో ఓటేసిన సీఎం
- కరీంనగర్ లో ఓటు హక్కు వినియోగించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

02




'పీపుల్స్ పల్స్' ఎగ్జిట్ పోల్స్ సర్వే ఫలితాల్లో వెల్లడి

## పుర పీఠాలు 02
# హస్తగతం?
### కాంగ్రెస్‌కు అనుకూలంగా మున్సిపల్ పోలింగ్

హస్తం ఖాతాలో మంచిర్యాల, రామగుండం, నల్గొండ, మహబూబ్‌నగర్, కొత్తగూడెం
నిజామాబాద్, కరీంనగర్ మున్సిపోల్స్‌లో వికసించనున్న కమలం
ఒక్క కార్పొరేషన్‌నూ సొంతం చేసుకోలేని స్థితిలో బీఆర్ఎస్

# జగ్గారెడ్డి ఫైర్
### పోలీసులను బూతులు తిడుతూ గొడవకు దిగిన నేత



- కాంగ్రెస్ అభ్యర్థిని అడ్డుకోవడంతో ఆగ్రహం
- పోలింగ్ ఆపేస్తానంటూ బూత్ లోకి పరుగు
- సంగారెడ్డిలో పోలీసులతో వాగ్వాదం
- రంగంలోకి అడిషనల్ ఎస్పీ రఘునందన్

03

## తెలంగాణ గ్రామాలకు
# జాతీయ గుర్తింపు
కేంద్రం ప్రకటించిన
8 ఉత్తమ పంచాయతీలు

- మండోడ్డి నుంచి నెల్లొట్ల వరకు.. వివిధ విభాగాల్లో మెరిసిన తెలంగాణ గ్రామాలు
- పేదరిక నిర్మూలన నుంచి శుభ్రత వరకు కేంద్ర అవార్డులతో తెలంగాణ పంచాయతీల సత్తా
- గ్రామాభివృద్ధిలో తెలంగాణ మోడల్.. ఎనిమిది పంచాయతీలకు కేంద్ర ప్రశంసలు
- ఆరోగ్యం, నీరు, పచ్చదనం... అన్ని రంగాల్లో తెలంగాణ గ్రామాల ప్రతిభకు గుర్తింపు

02






# ఆస్పత్రిలో అభిషేక్ శర్మ
## నమీబియాతో మ్యాచ్ ఆడేది డౌటే
11

- కడుపునొప్పితో ఇబ్బందులు
- అమెరికా మ్యాచ్ కు ముందు రిలీఫ్ మెడిసిన్
- ఇంకా ఉదర సమస్యలున్నట్టు తెలిపిన డాక్టర్లు

# నేడు సార్వత్రిక సమ్మె
### భారత్ బంద్ తో నిలిచిపోనున్న రవాణా - విద్యా సంస్థలు, బ్యాంకులు



Indian Journalists Union

- లేబర్ కోడ్ లకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు
- ఐజేయూ సంఘీభావం
- నాలుగు లేబర్ కోడ్‌ల ఉపసంహరణ డిమాండ్
- 29 కార్మిక చట్టాల రద్దుపై ఆందోళన
- మీడియా సిబ్బంది హక్కులు బలహీనమయ్యాయని ఐజేయూ వ్యాఖ్య
- వర్కింగ్ జర్నలిస్టుల చట్టం పునరుద్ధరణ కోరుతూ కేంద్రానికి ఐజేయూ విజ్ఞప్తి
- వేజ్ బోర్డు వ్యవస్థ రద్దును ఖండించిన జర్నలిస్టుల యూనియన్లు

09

# మహా నగరం
### మూడు కార్పొరేషన్లు.. ఆరు జోన్లు

- ఓఆర్ఆర్ పరిధిలోని 27 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు జీహెచ్ఎంసీలో విలీనం
- 300 డివిజన్లతో దేశంలోనే అతిపెద్ద మహానగరంగా గ్రేటర్ సిటీ
- జీహెచ్ఎంసీ యథాతథం..
- కొత్తగా మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లు
- ఈ నెల 10న ముగిసిన ప్రస్తుత పాలకమండలి పదవీ కాలం
- తాజాగా మూడు కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ
- పాత జీహెచ్ఎంసీలో దాదాపు కోటి మంది జనాభా
- 27 మున్సిపాలిటీల్లో 34లక్షల మంది నగరంలో 17 ఏళ్ల తర్వాత ప్రత్యేక అధికారి పాలన

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** గ్రేటర్ హైదరాబాద్.. మూడు కార్పొరేషన్లు.. ఆరు జోన్లు.. మూడొందల డివిజన్లతో దేశంలోనే అతిపెద్ద కార్పొరేషన్, మహనగరంగా అవతరించింది. నగర శివార్లలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన, మెరుగైన రవాణా సౌకర్యాలు, ఏకీకృత అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ సర్కార్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ను మూడు భాగాలు విభజించాలని నిర్ణయం తీసుకోవడంతో పాటు దాన్ని అమలు చేసింది. ఇటీవల హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని 27 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలను విలీనం చేసిన ప్రభుత్వం.. మొత్తం మూడొందల డివిజన్లు (జీహెచ్ఎంసీ తో కలిపి) ఏర్పాటు చేసింది. తద్వార మహానగర పాలక సంస్థ పరిధిని మరింత విస్తరింపజేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో హైదరాబాద్‌లో గ్రేటర్ కార్పొరేషన్ ఒక్కటే ఉండనుంది. ప్రస్తుతం మూడొందల డివిజన్లతో మిగతా 02లో





# కొత్త సీఎస్ ఎవరు?
### మార్చి 31తో రామకృష్ణారావు రిటైర్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మార్చి 31న పదవీ విరమణ చేయనున్నారు. వాస్తవానికి ఆయన 2025 ఆగస్టు 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం ఆయన పదవీ కాలాన్ని మరో ఏడు నెలల పాటు అంటే ఈ ఏడాది మార్చి 31 వరకూ పొడిగించారు. అందుకే మరోసారి ఆయనకు పొడిగింపు వచ్చే అవకాశం లేదని భావిస్తున్నారు. ఆయన పదవీ విరమణ దగ్గర పడుతుండటంతోనే, ఇప్పుడు కొత్త సీఎస్ ఎంపికపై చర్చ మొదలైంది. నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రేసులో సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుత పరిణామాలను గమనిస్తుంటే, 1992 బ్యాచ్ కు చెందిన ఆయన ఈ అత్యున్నత పదవికి ప్రధాన పోటీదారుగా ఉన్నట్లు సచివాలయ వర్గాల సమాచారం. రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంపై పూర్తి పట్టు ఉండటంతో పాటు మిగతా 02లో

- రేసులో 1992 బ్యాచ్ ఐఏఎస్ జయేష్ రంజన్
- కీలక శాఖల్లో దశాబ్ద అనుభవం.. పరిపాలనపై పూర్తి పట్టు
- టీ-హబ్, ఐటీ విధానాల్లో కీలక పాత్ర పోషించిన అధికారి
- సీనియార్టీలో శశాంక్ గోయల్, వికాస్ రాజ్ పేర్లు కూడా పరిశీలనలో
- అరవింద్ కుమార్‌పై కేసు ప్రభావం.. రేసులో వెనుకబాటు
- త్వరలోనే అధికారిక ప్రకటనకు ప్రభుత్వం సిద్ధం



## పది మంది
# ఐఏఎస్‌ల బదిలీ
### సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధప్రకాశ్

ఎస్సీ అభివృద్ధి ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్.. గిరిజన సంక్షేమ బాధ్యతలు కొనసాగింపు
పంచాయతీరాజ్, ప్రణాళిక శాఖలకు అదనపు బాధ్యతలు
ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా కాత్యాయనీ దేవి..
జలమండలి జేఎండీగా మయాంక్ మిట్టల్
పరిశ్రమల శాఖలో రఘురామ్ శర్మ.. మంత్రి శ్రీధర్‌బాబు ఓఎస్డీగా కొనసాగింపు

03

## లోక్‌సభలో మంటపెట్టిన
# రాహుల్ గాంధీ
### ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రస్తావనతో లోక్‌సభలో రగడ..



- అనిల్ అంబానీ, హర్దీప్ సింగ్ పూరీ పేర్లు వినిపించడంతో బీజేపీ ఆగ్రహం
- అమెరికా ట్రేడ్ డీల్‌పై మోదీ సర్కార్‌ను నిలదీశిన రాహుల్..
- ప్రధాని పార్లమెంట్‌కు దూరమవుతున్నారంటూ ప్రతిపక్ష నేత ఆరోపణలు
- ప్రభుత్వ కౌంటర్ దాడి.. ఆధారాలు లేని ఆరోపణలంటూ కేంద్ర మంత్రుల స్పందన
- సభా గందరగోళం మధ్య 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్.. బడ్జెట్ సమావేశాల్లో హైడ్రామా

09

## పాకిస్తాన్ కుప్పకూలడం
# ఖాయం!
### 21 ఏళ్లలో ఇదే ఫస్ట్ టైం

- ముదురుతున్న ఆర్థిక సంక్షోభం.. రికార్డు స్థాయి నిరుద్యోగం
- యువత విదేశాల బాట,
- ఐఎంఎఫ్ అప్పులపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థ..
- ఉద్యోగాల కొరతతో నిస్సహాయ స్థితి
- 30 లక్షల ఉద్యోగాల అవసరం ప్రతీ ఏడాది
- పరిశ్రమల మూతలతో భవిష్యత్ అనిశ్చితం

09



## మూసీ పునరుజ్జీవానికి
# తొలి అడుగు
### నది పరివాహక ప్రాంతాల అభివృద్ధికి భూసేకరణ ప్రక్రియ మొదలు

- హిమాయత్ సాగర్ – గాంధీ సరోవర్ మధ్య 9.2కి.మీ భూసేకరణ
- ఉస్మాన్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు మరో 11.8కి.మీ పరిధి
- తొలి విడతగా 50 ఎకరాల భూమి సేకరణకు చర్యలు
- మార్కెట్ విలువ ఆధారంగా యజమానులకు పరిహారం
- అభ్యంతరాల నమోదు కోసం గడువు ప్రకటించిన ప్రభుత్వం
- నాలుగు జిల్లాల్లో 55కి.మీ పరిధిలో దశలవారీగా అభివృద్ధి పనులు

03

మూసీ నది పునరుజ్జీవనానికి తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నది పరివాహక ప్రాంతాల అభివృద్ధి కోసం తొలి విడతగా 50 ఎకరాల భూసేకరణ ప్రక్రియను ప్రారంభిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందజేస్తామని స్పష్టం చేస్తూ, అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులో తెలియజేయాలని ప్రభుత్వం సూచించింది.





## యూరియా కోసం
# రైతుల ఆందోళన

- యాప్‌లో సాంకేతిక లోపాలపై మండిపడ్డ అన్నదాతలు
- పాత విధానంలోనే పంపిణీ చేయాలంటూ డిమాండ్
- రాస్తారోకోతో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై 3 గంటల ట్రాఫిక్ జామ్

03






సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 12.02.2026
www.mudranews.in | @mudranews



## తెలుగునాట టాప్ 10 ఎన్నికలు
విజేతలు-పార్టీలు

1952 సార్వత్రిక ఎన్నికలు (హైదరాబాద్ రాష్ట్రం)
విజేత పార్టీ: ఇండియన్ నేషనల్ కాంగ్రెస్
ముఖ్య నాయకుడు: బూర్గుల రామకృష్ణారావు

# పోలింగ్ ప్రశాంతం

ముద్ర, తెలంగాణ బ్యూరో: చెదురు ముదురు సంఘటనలు మినహా.. తెలంగాణలో మున్సిపల్ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు సంబంధించి బుధవారం ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. 5 గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సరళి తొలుత ప్రశాంతంగా ప్రారంభమైనప్పటికీ పోలింగ్ ముగిసే సమయానికి రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ప్రధాన పార్టీల మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు జరిగాయి. పలు చోట్ల రాజకీయ పార్టీ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడైనా అదుపుతప్పే పరిస్థితులు ఉంటే వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితులను అదుపులోకి తీసుకు రావడంతో పోలింగ్ ప్రక్రియ అంతా సజావుగా జరిగిపోయింది. ఈ ఎన్నికలకు సంబంధించిన ఓట్లు 13న లెక్కించనున్నారు.

**బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవిష్యత్తు**

మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో తమ జెండా ఎగరేసేందుకు ప్రధాన పార్టీలు నువ్వా నేనా అన్నట్లు ప్రచార పర్వాన్ని సాగించాయి. ప్రత్యర్థులపై మాటల తూటాలు వదులుతు రాజకీయాన్ని రక్తికట్టించాయి. వాదనలు, సవాళ్లతో మొదలైన ప్రచార విలువలకు తిలోదకాలు దిద్దుతూ తిట్ల పురాణాల వరకు చేరుకుంది. పార్టీల వ్యూహాలు, హామీలు, ప్రచార సరళిని అంతా గమనించిన ఓటర్లు పార్టీల భవిష్యత్ ను, అభ్యర్థుల అదృష్టాన్ని ఓటు రూపంలో బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. ఓటర్లు ఎవరికి పట్టం కట్టారో రేపు తేలనుంది. మొత్తం 116 మున్సిపాలిటీలలోని 2582 వార్డులకు 12 వార్డులు ఏకగ్రీవం కాగా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో ఒక చోట వాయిదా పడింది. ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించిన 414 డివిజన్లలో . రెండు ఏకగ్రీవం కాగా మిగిలిన 412 చోట్ల పోలింగ్ నిర్వహించారు.

**కరీంనగర్ లో పోలీసుల లాఠీచార్జి**

కరీంనగర్‌లోని 58వ డివిజన్ వద్ద గుమిగూడిన బీజేపీ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ ఘటనలో పలువురు బీజేపీ కార్యకర్తలకు గాయాలు కాగా, ఆరుగురు కార్యకర్తల చేతులు విరిగినట్లు సమాచారం. ఈ ఘటనలో కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యక్తిగత ఫోటోగ్రాఫర్ కు సైతం గాయాలైనట్లు తెలిసింది. బీఆర్ఎస్ నేతలు దొంగ ఓట్లు వేయిస్తున్నారని తాము చెబుతున్న తమపైనే పోలీసులు విచక్షణరహితంగా దాడిచేశారని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. 58వ డివిజన్‌లో దొంగ ఓట్లు వేయిస్తున్నారని చెబుతుంటే..పోలీసులు తమపై లాఠీ ఛార్జి చేయడమేంటని మండిపడ్డారు. పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీజేపీ శ్రేణులు జిల్లా పరిషత్ ముందు రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఘటన స్థలానికి అదనపు పోలీసు బలగాలు చేరుకున్నాయి. మరోవైపు కరీంనగర్‌లోని 34వ డివిజన్‌లో దొంగ ఓట్లు వేస్తున్న వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. హుస్నేనీపుర ప్రాంతంలోని సూఫా కాన్వెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఒక ఇండిపెండెంట్ అభ్యర్థికి సంబంధించిన యువకులు దొంగ ఓట్లు వేస్తూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్న పోలీసులు, వారిని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎంఐఎం పార్టీ అభ్యర్థి మహమ్మద్ ఖాజా మజారుద్దీన్ తీవ్రంగా స్పందించారు. తనను ఓడించాలనే కుట్రతో ఇండిపెండెంట్ అభ్యర్థి సమీనా పర్వీన్ తరఫున దొంగ ఓట్లు వేయించారని ఆరోపించారు. ఈ బూత్‌లో జరిగిన అక్రమాల నేపథ్యంలో రీపోలింగ్ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టుబడ్డ యువకుల పేర్లు ఎండి మొహీబుద్దీన్, ఎండి నజీబుద్దీన్‌గా పోలీసులు గుర్తించారు. వీరిలో ఒకరు ఖాన్‌పురా, మరొకరు సలీఫ్ నగర్‌కు చెందిన వారిగా గుర్తించారు.

ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌లోని పోలింగ్ కేంద్రానికి ఓటు వేయడానికి వచ్చిన ఒక మహిళ తన వెంట కత్తిని తీసుకురావడం కలకలం రేపింది. ఆమెను చూసిన తోటి ఓటర్లు, అక్కడున్న సిబ్బంది షాక్‌కు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సదరు మహిళను, ఆమె భర్తను అదుపులోకి తీసుకున్నారు. ఆమె కత్తిని ఎందుకు తీసుకువచ్చింది అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నిజామాబాద్‌లో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చిన స్థానిక బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఓ కానిస్టేబుల్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్లను ప్రభావితం చేస్తున్నారన్న ఆరోపణలతో ఏసీపీతోనూ ఆయన వాగ్వివాదానికి దిగారు. నిజామాబాద్ పరిధిలోని బూత్ నంబర్ 7లో శంకర్ అనే కానిస్టేబుల్, ఒక మున్సిపల్ ఉద్యోగి కలిసి ఓటర్లను కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలంటూ ప్రభావితం చేస్తున్నారని తనకు సమాచారం అందిందన్నారు. అందుకే ఇక్కడికి వచ్చానన్నారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఏసీపీతో ఎంపీ మాట్లాడారు. 'మీ కానిస్టేబుల్ తప్పు చేస్తే, మీరు చేసినట్టే' అని ఎంపీ అరవింద్ ఏసీపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. 'మాకు టెర్రరిస్టులు కాదు.. మీరే నేర్పుకోండి ముందు' అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అంతకు ముందు.. వినాయక్ నగర్ డివిజన్‌లో ఎంపీ.. కార్యకర్తలతో మాట్లాడారు. ఓ డివిజన్‌లో ప్రత్యర్థులు కుల ప్రస్తావన తెస్తున్నారని కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. అరవింద్ ఘాటుగా స్పందించారు. 'క్యాస్ట్ ఫీలింగ్ తెస్తే, ఒక్కటే అడగండి.. గతంలో కాశ్మీర్‌లో, ఇప్పుడు బంగ్లాదేశ్‌లో హిందువులను చంపేటప్పుడు కులం చూసి చంపారా? లేక హిందువులని చంపారా? అని నిలదీయండి' అని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

సంగారెడ్డి మున్సిపాలిటీలో పోలీసులకు, జగ్గారెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. 34వ వార్డులో సీఐ ఆ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి అడ్డుకుని కాలర్ పట్టుకున్నారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు సీఐ తీరుపై మండిపడ్డారు. విషయం తెలుసుకున్న జగ్గారెడ్డి పోలింగ్ సెంటర్ వద్దకు చేరుకుని పోలింగ్ ఆపేస్తానంటూ బూత్ లోకి వెళ్లడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. పోలీసులతో జగ్గారెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు జగ్గారెడ్డిని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి పోలీసులపై ఘాటు వ్యాఖ్యలతో రెచ్చిపోయారు. రిగ్గింగ్ చేస్తున్నారని చెప్పిన తమ అభ్యర్థి పై సీఐ శివకుమార్ గల్లా పట్టడని ఆరోపించారు. ఆ సీఐ మొగోడు అయితే ఇక్కడికి రావాలని మండిపడ్డారు. సంగారెడ్డిలో లా అండ్ ఆర్డర్ సమస్య వస్తే దానికి సీఐ, హోంగార్డ్ కారణం అన్న జగ్గారెడ్డి.. మొగోణ్ణి నేనో పోలీసులో ఈరోజు తేలిపోవాలంటూ రెచ్చిపోయారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణం 21వ వార్డు పరిధిలోని ఆచీసా సాగర్ నగర్ లో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఒకే చోట బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల కార్యకర్తలు గుమిగూడి పరస్పర నినాదాలు చేసుకున్నారు. దాంతో ఆ ప్రాంతమంతా టెన్షన్ వాతావరణం నెలకొంది. రెండు పార్టీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. రంగంలో దిగిన పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. రాకసిపేట గోశాలలో బూత్ నెంబర్ 24, 78లలో ఇతరుల పేరుతో ఓటు వేసేందుకు ఇద్దరు యువకులు వచ్చారు. తప్పుడు గుర్తింపు పత్రాలతో పోలింగ్ కేంద్రంలోకి రావడంతో అధికారులు గుర్తించి పోలీసులకు అప్పగించారు.

భూపాలపల్లి మున్సిపాలిటీలో నోట్ల కట్టలు కలకలం రేపాయి. 22వ వార్డు పోలింగ్ కేంద్రం సమీపంలో ఓ వ్యక్తి ఓటర్లకు డబ్బులు పంచుతున్నాడు. గమనించిన పోలీసులు అతడ్ని పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో సదరు వ్యక్తి రోడ్డుపైనే నోట్ల కట్టలు విసిరేసి అక్కడ్నుంచి పరుగు తీశాడు. రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు.. పారిపోయిన వ్యక్తిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ప్రధాన పార్టీ తరఫున డబ్బులు పంచుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపాలిటీలోని 24 వార్డులో ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి తరఫున డబ్బులు పంచుతుండగా పట్టుకున్న పోలీసులు రూ.11,600 నగదును సీజ్ చేశారు.

జనగామ మున్సిపాలిటీలోని 23వ వార్డు పరిధికి చెందిన కొంతమంది ఓటర్లు.. అందో ళనకు దిగారు. ఆ వార్డులోని సరస్వతి స్కూల్ పోలింగ్ స్టేషన్ వద్దకు చేరుకున్న కొందరు మహిళా ఓటర్లు.. తమ వార్డులో కొందరికి మాత్రమే ఓటు వేయమని డబ్బులు ఇచ్చారని.. తమకు మాత్రం ఇవ్వలేదని వారు ఆందోళనకు దిగారు. గత పదేళ్లుగా ప్రధాన పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించుకున్నామని చెప్పారు. అయినా ఈ ఎన్నికల్లో మాత్రం తమకు డబ్బులు ఇవ్వకుండా కొందరికే పంపిణీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

కరీంనగర్ జిల్లాలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. ఎన్నికల సిబ్బంది పై పిచ్చి కుక్కలు దాడి చేశాయి. ఎన్నికల పోలింగ్ కేంద్రం ప్రాంగణంలో ఉన్న ఎన్నికల సిబ్బందిపై దాడి చేసిన రెండు పిచ్చి కుక్కలు అటాక్ చేశాయి. ఈ దాడిలో ముగ్గురు అధికారులు గాయపడ్డారు. గాయపడినవారికి అక్కడే ఉన్న వైద్య శిబిరంలో ప్రాథమిక చికిత్స చేయించి.. వ్యాక్సిన్ ఇప్పించి ఇంటికి పంపించారు.

**ఓటేసిన ప్రముఖులు**

సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో ప్రజలందరూ కాంగ్రెస్ వైపే మొగ్గు చూపారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా తీర్పుతో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకుంటామని చెప్పారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జ్యోతి నగర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 361వ పోలింగ్ బూత్‌లో ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఓటు వేశారు. ఓటు వేసిన అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధం అని పేర్కొన్నారు. పట్టణాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33వ డివిజన్ లో ఉన్నలక్ష్మిగూడెం పబ్లిక్ స్కూల్ లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో అన్ని డివిజన్లలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుని నల్గొండ మున్సిపాలిటీని మోడల్ సిటీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిర మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నిజామాబాద్‌లోని 47వ డివిజన్‌లో సన్ ఫ్లవర్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మంచిర్యాల జిల్లా హైటెక్ సిటీలోని 227వ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి కోదాడ పురపాలక సంఘము పరిధిలోని 14 వ వార్డు 34 వ బూత్ లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మక్తల్ పట్టణంలోని 7వ వార్డులో ఓటు వేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ జోగిపేటలోని 9వ వార్డులో ఓటు వేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పురపాలిక 11వ వార్డులో ఓటు వేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు.. అక్కడ సెల్ఫీ తీసుకుంటున్నారు. సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం తెల్దారుపల్లి పోలింగ్ కేంద్రం 16 లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ వినాయక్ నగర్‌లో ఓటు వేశారు.

**ఢిల్లీలో సీఎం రేవంత్..**

కొడంగల్ లో తన ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం రేవంత్ రెడ్డి అక్కడ్నుంచి నేరుగా ఢిల్లీకి పయనమయ్యారు. బుధవారం సాయంత్రం అక్కడ ఏఐ బిజినెస్ గడిపారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో భేటీ అయిన ఆయన నేడు రైల్వే, ఎరువులు–రసాయనాలు, జలవనరుల శాఖ మంత్రులను కలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఢిల్లీ పర్యటనలో భాగంగా రేవంత్ రెడ్డి ఏఐసీసీ పెద్దలతో భేటీ కావడం ఆసక్తి రేపుతోంది. ఈ సందర్భంగా ప్రభుత్వం, పార్టీలోని తాజా పరిణామాలను సీఎం అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ముఖ్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణంతో పాటు మంత్రివర్గ విస్తరణపై చర్చించే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తి కావడంతో పాటు కేబినెట్‌లో మరో బెర్త్ ఖాళీగా ఉంది. మున్సిపల్ ఎన్నికల్లో సరైన రీతిలో పని చేయని మంత్రులపై చర్యలు తప్పవని సీఎం సీరియస్ వార్నింగ్ ఇచ్చారనే టాక్ ఇటీవల పొలిటికల్ సర్కిల్స్ లో వినిపించింది. ఈ నేపథ్యంలో మంత్రి విస్తరణ మరోసారి ఉండబోతోందా? ప్రస్తుత మంత్రుల పనితీరు ఆధారంగా కేబినెట్‌లో మార్పులు చేర్పులు ఉండబోతున్నాయా అనేది ఉత్కంఠగా మారింది.



**ఓటెత్తారు.. సత్తాచాటిన మహిళలు**

| | |
|---|---|
| మున్సిపల్ ఎన్నికల్లో నమోదైన పోలింగ్ 73.01 శాతం | |
| ఏడు కార్పొరేషన్ లలో పోలింగ్ 66.05 % | |
| 116 మున్సిపాలిటీల్లో పోలింగ్ 75.88 % | |
| అత్యధికంగా పోలింగ్ జరిగిన మున్సిపాలిటీ చౌటుప్పల్ 91.91. % | |
| అతి తక్కువ పోలింగ్ జరిగిన మున్సిపాలిటీ నందికొండ : 56.68% | |
| అత్యధికంగా పోలింగ్ జరిగిన కార్పొరేషన్ నల్గొండ : 77.36 % | |
| అతి తక్కువ పోలింగ్ జరిగిన కార్పొరేషన్ నిజామాబాద్ : 59.12% | |
| మహిళల ఓటింగ్ శాతం : 73.39 | |
| పురుషుల ఓటింగ్ శాతం : 72.63% | |

# కొత్త సీఎస్ ఎవరు?

(మొదటి పేజీ తరువాయి)

గత దశాబ్ద కాలంగా కీలక శాఖల్లో ఆయన అందించిన సేవలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ దిశగా మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం జయేష్ రంజన్ మెట్రోపాలిటన్ ప్రాంతం, పట్టణాభివృద్ధి శాఖకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హెచ్ఎండీఏ పరిధిలోని పట్టణ పాలనతో పాటు.. యువజన పురోగతి, పర్యాటక, సాంస్కృతిక శాఖ, క్రీడల శాఖ , పురావస్తు శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా, దేశవ్యాప్తంగా యువ సివిల్ సర్వెంట్లకు మార్గనిర్దేశం చేసే నేషనల్ పూల్ ఆఫ్ ట్రైనర్స్ ఇన్ లీడర్‌షిప్‌లో ఆయన సభ్యులుగా కొనసాగుతున్నారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఐటీ, పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖల సారథిగా జయేష్ రంజన్ చెరగని ముద్ర వేశారు. దాదాపు పదేళ్ల పాటు ఈ శాఖలను పర్యవేక్షించిన ఆయన, రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా భారత్‌లోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్ అయిన 'టీ-హబ్' ఏర్పాటు, వినూత్నమైన ఐటీ , పారిశ్రామిక విధానాల రూపకల్పనలో ఆయన కృషి మరువలేనిది. వివిధ పర్యటనల ద్వారా గ్లోబల్ ఇన్వెస్టర్లను తెలంగాణ వైపు ఆకర్షించడంలో ఆయన ప్రత్యేకత చూపిస్తారు.

జయేష్ రంజన్ 1992 ఐఏఎస్ బ్యాచ్ ఆల్ ఇండియా టాపర్‌గా నిలిచారు. ఐఐఎం కలకత్తా , సింగపూర్‌లోని లీ క్వాన్ యూ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి విద్యనభ్యసించిన ఆయన, విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో దిట్టగా పేరు పొందారు. గతేడాదిగా వివిధ పాలనాపరమైన మార్పుల్లో భాగంగా డిసెంబర్ 2025 లో ఆయన పరిశ్రమల శాఖ నుంచి పట్టణాభివృద్ధి శాఖకు బదిలీ అయ్యారు. రాష్ట్ర బ్యూరోక్రసీలో అగ్రస్థానంలో మార్పులు జరగనున్న తరుణంలో, జయేష్ రంజన్ అనుభవం, ప్రభుత్వ ప్రాధాన్యత లపై ఆయనకున్న అవగాహన సీఎస్ పదవికి ఆయనను ముందు వరుసలో నిలబెడుతున్నాయి. అధికార వర్గాల్లో ఉన్న క్లీన్ ఇమేజ్, పాలనాపరమైన కొనసాగింపు దక్కుతుందన్న నమ్మకం అధికార వర్గాల్లో ఉంది. ప్రభుత్వం త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

జయేష్ రంజన్ కంటే సీనియర్లు శశాంక్ గోయల్ ,అరవింద్ కుమార్ ఉన్నారు. అరవింద్ కుమార్ పై ఫార్ములా ఈ రేసు కేసు ఉంది. దాంతో ఆయన పేరు పరిశీలనలోకి తీసుకునే అవకాశం లేదు. మరో సీనియర్ అధికారి వికాస్ రాజ్ కూడా రేసులో ఉన్నారు. అయితే ప్రభుత్వ పెద్దలకు అన్నీ తానై వ్యవహరించే జయేష్ రంజన్ కే ఎక్కువ అవకాశాలు ఉన్నట్లుగా భావిస్తున్నారు.

# 'పుర'పీఠాలు 'హస్త'గతం?

ముద్ర, తెలంగాణ బ్యూరో: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత... పోలింగ్ సరళికి అనుగుణంగా ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెలువడ్డాయి. 7 కార్పొరేషన్లలో మంచిర్యాల, రామగుండం, నల్గొండ, మహబూబ్‌నగర్, కొత్తగూడెంను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని 'పీపుల్స్ ప ల్స్' ఎగ్జిట్ పోల్స్ సర్వే అంచనా వేసింది. నిజామాబాద్, కరీంనగర్‌ను బీజేపీ దక్కించుకుంటుందని, బీఆర్ఎస్ ఒక్క కార్పొరేషన్‌నూ సొంతం చేసుకోలేదని పేర్కొంది. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ దాదాపు 70 శాతం మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను కైవసం చేసుకోనున్నట్లు పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వేలో వెల్లడయింది. 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ 68–76, బీఆర్ఎస్ 29–36, బీజేపీ 3–5, ఎంఐఎం 0–1, ఇతరులు 8–14 దక్కించుకుంటారని పేర్కొంది. ఇదిలావుంటే.. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ అయ్యే అవకాశాలున్నాయని పీపుల్స్ పల్స్ తేల్చి చెప్పింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేదని స్పష్టం చేసింది. కార్పొరేషన్లలో డివిజన్ల వారీగా పరిశీలిస్తే... రామగుండంలో కాంగ్రెస్ 30–34 డివిజన్లు హస్తగతం చేసుకునే అవకాశాలున్నట్లు వెల్లడించింది. బీఆర్ఎస్ 16–20, బీజేపీ 3–6, ఇతరులు 4–7 డివిజన్లు గెలుపొందే అవకాశం ఉందని చెప్పింది. మంచిర్యాలలో కాంగ్రెస్ 39–43, బీఆర్ఎస్ 8–12, బీజేపీ 6–9, ఇతరులు 1–2 డివిజన్లు, కొత్తగూడెంలో కాంగ్రెస్ 28–34, బీఆర్ఎస్ 7–9, సీపీఐ 14–16, ఇతరులు 2–4 స్థానాలు, మహబూబ్ నగర్ లో కాంగ్రెస్ 26–30, బీఆర్ఎస్ 18–22, బీజేపీ 6–8, ఎంఐఎం 2–4, ఇతరులు 0–1 డివిజన్లు గెలుపొందే అవకాశం ఉందని తెలిపింది. ఇక నల్లగొండలో కాంగ్రెస్ 21–26, బీఆర్ఎస్ 8–12, బీజేపీ 6–10, ఎంఐఎం 2–4, ఇతరులు 1–2 స్థానాలు, నిజామాబాద్ లో కాంగ్రెస్ 10–16, బీఆర్ఎస్ 2–4, బీజేపీ 26–31, ఎంఐఎం 8–12, ఇతరులు 1–2 డివిజన్లు, కరీంనగర్ లో కాంగ్రెస్ 14–16, బీఆర్ఎస్ 10–12, బీజేపీ 24–29, ఎంఐఎం 6–9, ఇతరులు 1–3 స్థానాల్లో గెలుపొందే అవకాశం ఉందని అంచనా వేసింది. మరోవైపు 68–76 మున్సిపాలిటీలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని సర్వేలో తేల్చిన పీపుల్స్ పల్స్... 29–36 మున్సిపాలిటీలను ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్, 3–5 బీజేపీ, 0–1 ఎంఐఎం గెలుచుకునే అవకాశం ఉందని వివరించింది. 8–14 మున్సిపాలిటీల్లో 'నువ్వా నేనా?' అన్నట్టు పోటీ ఉంటుందని, 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీకి 36 శాతం, బీఆర్ఎస్ కు 29.7 శాతం, బీజేపీకి 19.3 శాతం, ఏఐఎంఐఎం కు 2 శాతం ఓట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. కాంగ్రెస్ పార్టీ 1210–1290, బీఆర్ఎస్ 860–930, బీజేపీ 250–270, ఏఐఎంఐఎం 35–44, సీపీఐ 12–17, సీపీఎం 10–14, ఇతరులు 90–110 వార్డులు గెలుపొందే అవకాశం ఉందని అంచనా.

| జోన్లు | వాటి పరిధిలో సర్కిళ్లు |
|---|---|
| శంషాబాద్ | : ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్ |
| చార్మినార్ | : సంతోష్ నగర్, యాకత్‌పురా, మలక్‌పేట, చార్మినార్, మూసారాంబాగ్. |
| ఖైరతాబాద్ | : ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట |
| రాజేంద్రనగర్ | : రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్ |
| గోల్కొండ | : గోషామహల్, కార్వాన్, గోల్కొండ, మెహిదీపట్నం, మాసాబ్ ట్యాంక్ |
| సికింద్రాబాద్ | : కవాడిగూడ, ముషీరాబాద్, అంబర్‌పేట్, తార్నాక, మెట్టుగూడ |

# 'మహా'నగరం

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోనే అతి పెద్ద మహానగరంగా విస్తరించిన జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)గా విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీలో శంషాబాద్, రాజేంద్రనగర్, గోల్కొండ, సికింద్రాబాద్, చార్మినార్, ఖైరతాబాద్ జోన్లు, మల్కాజిగిరి కార్పొరేషన్‌లో మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్లు, సైబరాబాద్ కార్పొరేషన్‌లో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్లు ఖరారు చేసింది.

**మారిన స్వరూపం**

ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ 6 జోన్లుగా, 30 సర్కిళ్లుగా, 150 వార్డులుగా విభజింపబడింది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో.. 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 డివిజన్లతో అతిపెద్ద నగరపాలక సంస్థగా ఏర్పాటైంది. ప్రస్తుత జీహెచ్ఎంసీని ప్రభుత్వం 70 లక్షల జనాభాతో కూడిన ఆరు జోన్లకు పరిమితం చేశారు. సగటున 35లక్షల జనాభా ఉండేలా జీహెచ్ఎంసీతో పాటు మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లను మూడు జోన్ల చొప్పున ఏర్పాటు చేసింది. పాత జీహెచ్ఎంసీలో దాదాపు కోటి మంది జనాభా ఉండేది. 27 మున్సిపాలిటీల విలీనం తర్వాత 1.34కోట్ల మంది జనాభా ఉంది. గతంలో 150 డివిజన్లు ఉండగా.. డివిజన్ల పునర్విభజనలో అవి ప్రస్తుతం 300కు పెరిగాయి. పాత హైదరాబాద్ నగరంలో జనాభా అధికంగా ఉన్నందున.. డివిజన్ల సంఖ్య దాదాపు రెట్టింపయింది. గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనమైన 27 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో జనాభా అంతంత మాత్రంగానే ఉంది.

**17 ఏళ్ల తర్వాత ప్రత్యేక పాలన**

గ్రేటర్ నగరంలో 17 ఏళ్ల తర్వాత ప్రత్యేక అధికారి పాలన రాబోతున్నది. ఈనెల 10తో ప్రస్తుత పాలకమండలి పదవీ కాలం కూడా ముగిసింది. ఎన్నికలు జరిగే వరకు స్పెషల్ ఆఫీసర్ పాలన సాగనుంది. దీంతో జీహెచ్ఎంసీ మరోసారి ప్రత్యేక అధికారి పాలనలోకి వెళ్లింది. పాలక మండలి పదవీ కాలం అయిపోతే.. మేయర్‌కు సమాన హోదాలో ప్రభుత్వం స్థానిక సంస్థలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించి పరిపాలనను కొనసాగిస్తుంది. చివరి సారిగా 2008 సెప్టెంబరు 4 నుంచి 2009 డిసెంబరు 4 వరకు ఎస్.పి.సింగ్ జీహెచ్ఎంసీ కమిషనర్, ప్రత్యేక అధికారి హోదాలో పరిపాలన చేపట్టారు.

**జాతీయ స్థాయి గుర్తింపు**

ఈ సంవత్సరం 8 గ్రామ పంచాయతీలను ఉత్తమ పంచాయతీలుగా కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గద్వాల్ జిల్లాలోని మండొడ్డి గ్రామం పేదరిక రహిత మరియు మెరుగైన జీవనోపాధి విభాగంలో ఉత్తమ పంచాయతీగా ప్రకటించబడింది. ఆరోగ్యకరమైన పంచాయతీ – గౌతంపూర్ (కొత్తగూడెం జిల్లా), నీటి సదుపాయం ఉన్న గ్రామం – నెల్లుట్ల (జనగామ), శుభ్రమైన, ఆకుపచ్చ పంచాయతీ – నెల్లుట్ల (పెద్దపల్లి). ఈ సంవత్సరంగా గంభీరరావుపేట, హన్వాడ, చిమల్దరి మరియు ఖపూర్‌లను కూడా ఉత్తమ పంచాయతీలుగా ప్రకటించారు.



తెలుగునాట టాప్ 10 ఎన్నికలు – విజేతలు- పార్టీలు

1957 సార్వత్రిక ఎన్నికలు (ఆంధ్రప్రదేశ్)
విజేత పార్టీ: ఇండియన్ నేషనల్ కాంగ్రెస్
ముఖ్య నాయకుడు: నీలం సంజీవరెడ్డి



# మూసీ పునరుజ్జీవానికి తొలి అడుగు

- **నదీ పరీవాహక ప్రాంతాల్లో అభివృద్ధి**
- **భూసేకరణ ప్రక్రియ మొదలు**
- **తొలి విడతగా 50 ఎకరాల సేకరణ**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మూసీ నదిని ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా కీలక ప్రాజెక్టు చేపడుతున్న తెలంగాణ సర్కార్.. దానికి సంబంధించి కీలక చర్యలు చేపట్టింది. ఈ ప్రాజెక్టులో అతి ముఖ్యమైన భూసేకరణ ప్రక్రియను ప్రారంభించింది. 50 ఎకరాల భూమిని సేకరించేందుకు చర్యలు చేపట్టింది. భూ సేకరణకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసిన సర్కార్.. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని పేర్కొంది. మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపింది. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియను మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలోనే మూసీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు భూసేకరణ కోసం.. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) కీలక ప్రకటన చేసింది. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న వారు ఏవైనా అభ్యంతరాలు ఉంటే.. నిర్ణీత గడువులో తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

ఫేజ్ A1 కింద.. హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు మొత్తం 9.2 కిలోమీటర్ల మేర భూ సేకరణ చేయనున్నారు. ఫేజ్ A2 లో భాగంగా ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు ఉన్న 11.8 కిలోమీటర్ల భూమిని సేకరించనున్నారు. హైదరాబాద్ జిల్లా గోల్కొండ మండలం.. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలో ఉన్న భూముల సేకరణ కోసం తాజాగా ఎంఆర్‌డీసీఎల్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగానే సుమారు 50 ఎకరాలకు పైగా భూమిని సేకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

మార్కెట్ విలువ ఆధారంగా భూమిని ఇచ్చే యజమానులకు పరిహారం ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందులో భాగంగానే వారి భూమి పట్టాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్లకు సంబంధించిన వివరాలను ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది.



ఇక అభ్యంతరాల కోసం గడువు ప్రకటించిన ప్రభుత్వం.. ఆలోగా ఏదైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే ఆయా భూముల సర్వే నంబర్లు.. గ్రామాల వారీగా పూర్తి లిస్ట్‌ను విడుదల చేసింది.

భూ సేకరణ చట్టం2013 నిబంధనల ప్రకారం ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను చేపట్టనుంది. మొత్తం 4 జిల్లాల పరిధిలో భూసేకరణ చేపట్టనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మూసీ డెవలప్‌మెంట్ పనులు చేపట్టనున్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల పరిధిలో.. 14 మండలాల్లోని మొత్తం 46 గ్రామాల్లో పలు దశల వారీగా మూసీ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు.

## సైబరాబాద్ కార్పొరేషన్ తొలి కమిషనర్ గా శ్రీజన

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



నూతనంగా ఏర్పడిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తొలి కమిషనర్‌గా శ్రీజన బాధ్యతలు స్వీకరించారు. బుధవారం నుంచి అమె ఐటీ కారిడార్, వెస్ట్ హైదరాబాద్‌లోని కీలక ప్రాంతాల అభివృద్ధి, పరిపాలన బాధ్యతలు పర్యవేక్షించనున్నారు. ఐటీ హబ్ అయిన సైబరాబాద్ ప్రాంతంలో ట్రాఫిక్, వ్యర్థాల నిర్వహణ, మౌలిక సదుపాయాల మెరుగుదల లాంటి ప్రధాన సవాళ్లు ఆమె ముందు ఉన్నాయి. ఆమె వెంట మూడు కార్పొరేషన్లకు ప్రత్యేకాధికారిగా నియమించబడిన సీనియర్ ఐఏఎస్ జయేష్ రంజన్ కూడా ఉన్నారు. 2013 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి శ్రీజన తన సమర్థతతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆమె గతంలో విశాఖపట్నం కమిషనర్‌గా, కర్నూలు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్‌గా పనిచేశారు. కోవిడ్ సమయంలో బాలింతగా ఉండి కూడా కేవలం 22 రోజులకే విధుల్లోకి చేరి తన కర్తవ్యాన్ని నిర్వహించి అందరి మెప్పు పొందారు.

## పది మంది ఐఏఎస్ లు బదిలీ

- **సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధప్రకాశ్**
- **ఎస్సీ అభివృద్ధిశాఖ ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



తెలంగాణలో పది మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధప్రకాశ్ నియమితులయ్యారు. ఎస్సీ అభివృద్ధిశాఖ ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్ బాధ్యతలు చేపట్టనున్నారు. గిరిజన సంక్షేమ ప్రత్యేక సీఎస్‌గా కూడా ఆయన కొనసాగనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పంచాయతీరాజ్ కమిషనర్‌గా దివ్య దేవరాజన్ కు అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శిగా సందీప్‌కుమార్ సుల్తానియాకు అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా కాత్యాయనీ దేవి బదిలీ అయ్యారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ జేఎండీగా కాత్యాయనీ దేవికి అదనపు బాధ్యతలు అప్పగించారు. జలమండలి జేఎండీగా మయాంక్ మిట్టల్ నియమితులయ్యారు. పరిశ్రమలశాఖ ప్రత్యేక కార్యదర్శిగా రఘురామ్‌శర్మ బాధ్యతలు చేపట్టనున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఓఎస్‌డీగా అదనపు బాధ్యతల్లో కొనసాగనున్నారు.

## సివిల్ ఇంజనీరింగ్ లో 5వ ర్యాంక్

- **భారత ఓడరేవులు (పోర్టల్) ఉద్యోగ ఫలితాల్లో సత్తా సాటిన ఖమ్మం యువకుడు**

**ముద్ర, ఖమ్మం:**

ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ రైల్వే కాలనీకి చెందిన షేక్ సలీం బుధవారం వెలువడిన జాతీయ ఓడరేవులు (పోర్టల్) సివిల్ ఇంజనీరింగ్ ఫలితాలలో (హా.టి.నం ఐపి 525007943) 160 మార్కులకు గాను 146.25 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో ఐదో ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు. దేశవ్యాప్తంగా సివిల్ ఇంజనీరింగ్ అర్హత కలిగిన 14 పోస్టులు వెలువడిగా వీటిలో 9 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు ఉండగా 5 అసిస్టెంట్ మేనేజర్ (ఇన్ఫ్రాస్ట్రక్చర్ & ఫెసిలిటీస్) పోస్టులు ఉన్నాయి. వాటిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు అర్హత సాధించాడు. ఈ నియామక పరీక్ష 2025 డిసెంబర్ 2వ తేదీన నిర్వహించారు. నాగులవంచ రైల్వే కాలనీలో 2002 జనవరి 2న జన్మించిన సలీం 1 నుండి 10వ తరగతి వరకు ఖమ్మంలోనే కేంద్రీయ విద్యాలయంలో ఇంటర్మీడియట్ న్యూ విజన్ కళాశాల విద్యను అభ్యసించి 2020 ఇంటర్మీడియట్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 987 మార్కులు సాధించి తెలంగాణలో ఐదో ర్యాంకు సాధించాడు. ఎన్ఐటి వరంగల్ నందు 2024 లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో బీటెక్ పూర్తి చేశారు. సివిల్ ఇంజనీరింగ్ లో ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్) సాధించడమే తన లక్ష్యమని తెలిపారు. ఇతని తండ్రి నాగుల్ మీరా ఖమ్మంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మామిళ్ళగూడెంలో ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్నాడు. జాతీయ స్థాయిలో తమ గ్రామానికి చెందిన యువకుడు విజయం సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



## అడుగడుగునా అధికార దుర్వినియోగం

- **ఎన్నికల నియమావళి ఉల్లంఘన**
- **కాంగ్రెస్ పై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మున్సిపల్ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి మొదలు... మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగంతో పాటు ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత బుధవారం రాత్రి ఆయన ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. అందులో నామినేషన్ల దాఖలు మొదలు పోలింగ్ వరకూ కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను బెదిరించడంతో పాటు వారిపై భౌతిక దాడులకు తెగబడటం హీనమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమన్నారు. చట్టాన్ని సైతం లెక్కచేయకుండా.. అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల తీరు గర్హనీయమన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనన్నారు. కాంగ్రెస్ చేసిన కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని ధీమా వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఆకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం



చివరి వరకు కృషి చేసిన పార్టీ శ్రేణులందరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌పై విశ్వాసంతో తమ అమూల్యమైన ఓటు వేసిన ప్రతి ఓటరుకు హృదయ పూర్వక ధన్యవాదాలని హరీష్ రావు పేర్కొన్నారు.

## జగ్గారెడ్డిపై ఎన్నికల సంఘం సీరియస్

- **పోలీసులను బూతులు తిడుతూ గొడవకు దిగిన జగ్గారెడ్డి**
- **పోలింగ్ ఆపేస్తానంటూ దూసుకెళ్లిన వైనం**
- **కేసు నమోదు చేసి నివేదిక ఇవ్వాలని సంగారెడ్డి ఎస్పీకి ఆదేశాలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

సంగారెడ్డి పట్టణంలోని 34వ వార్డులో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న సిఐ శివకుమార్, హోంగార్డు చెన్నయ్యపై బూతులతో రెచ్చిపోయిన స్థానిక మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై రాష్ట్ర ఎన్నికల సంఘం సీరియస్ అయింది. ఆయనపై కేసు నమోదు చేసి, నివేదిక ఇవ్వాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల మనోభావాలు దెబ్బతీసేలా జగ్గారెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయని ఎన్నికల సంఘం అభిప్రాయపడింది. 34వ వార్డు ఇందిరా కాలనీలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సీసీఎస్ సీఐ శివకుమార్, స్థానిక కాంగ్రెస్ నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో సీఐ కాంగ్రెస్ నేత కాలర్ పట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలిసి జగ్గారెడ్డి రంగప్రవేశం చేశారు. జగ్గారెడ్డి తన కార్యకర్తను ఆపుతారా..? అంటూ ఆగ్రహానికి లోనయ్యారు. సీఐ శివకుమార్, హోంగార్డు చెన్నయ్యపై బూతులతో రెచ్చిపోయారు. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దీంతో స్పందించిన రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే జగ్గారెడ్డిపై అధికారులు కేసు నమోదు చేసి రిపోర్టు చేయాలని స్థానిక ఎస్పీకి ఆదేశాలు జారీచేసింది.

**దొంగ ఓట్లు ఎందుకు తొలగించలేదో చెప్పండి..**

దొంగ ఓట్లను తొలగించడంలో రాష్ట్ర ఎన్నికల సంఘం విఫలమైందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక ఆరోపణలు చేశారు. దొంగ ఓట్లను తొలగించని ఎన్నికల సంఘం వాటి గురించి ప్రశ్నించిన తమపై ఉల్టా కేసులు పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై చర్యలు తీసుకునే ముందు దొంగ ఓట్లను ఎందుకు తొలగించలేదో ఈసీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం



ఇచ్చిన నోటీసులపై జగ్గారెడ్డి స్పందించారు. బుధవారం రాత్రి సంగారెడ్డిలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను బీఆర్ఎస్ దొంగ ఓట్లపై ప్రశ్నించానని చెప్పారు. ఒక వార్డులో 300లకు పైగా దొంగ ఓట్లు ఉన్నాయని వివరించారు. మరో వైపు.. పోలింగ్ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న సీఐ.. 34 వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గల్లా పట్టుకున్నారని చెప్పారు. దీంతో ఆ సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశానన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రిగ్గింగ్‌కు సీఐ సహకరిస్తున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు.

## ఎమ్మెల్యే కూనంనేని, సీఐ మధ్య వాగ్వివాదం

- **ఎమ్మెల్యే కూనంనేని, సీఐ మధ్య వాగ్వివాదం**

**ముద్ర, కొత్తగూడెం:**

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు పాల్వంచ సీఐ మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. సీఐ దురుసుగా ప్రవర్తించాడంటూ ఎర్ర దండు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. మున్సిపల్ పోలింగ్ నేపథ్యంలో ఒక మహిళను దొంగ ఓటు ఆరోపణలతో పోలీసులు స్టేషన్లో నిర్బంధించారు. అమాయకురాలిని అనవసరంగా అరెస్టు చేశారని, వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యేతో సహా పార్టీ శ్రేణులు సీఐ ని అడగటానికి స్టేషన్ కు వెళ్లారు. అయితే, ఎస్ హెచ్ఓ వారి పట్ల మర్యాద లేకుండా ప్రవరించినట్లు తెలుస్తోంది. దీంతో ఆగ్రహించిన సీపీఐ కార్యకర్తలు సీఐ క్షమాపణ చెప్పే వరకూ కదిలేది లేదని ఎమ్మెల్యేతో సహా స్టేషన్ ఆవరణలో బైఠాయించారు. దీంతో పోలింగ్ ముగిసిన తరువాత పాల్వంచలో కొంత ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది



## యూరియా కోసం రైతుల ఆందోళన

- **తిప్పర్తిలోని అద్దంకి - నార్కట్‌పల్లి రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్**

**ముద్ర, తిప్పర్తి:**

యూరియా కోసం నల్గొండ జిల్లా తిప్పర్తి మండల రైతులు ఆందోళనకు దిగారు. సాగుకు కీలకమైన యూరియా సకాలంలో అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం మండల కేంద్రంలో అద్దంకి నార్కట్‌పల్లి రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన యూరియా పంపిణీ యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని మండిపడ్డ రైతులు.. తమకు సకాలంలో ఎరువులు అందడం లేదని ఆరోపించారు. వరి నాట్లు వేసిన సమయంలో యూరియా వేయడం అత్యవసరమని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్‌లో గంటల తరబడి ప్రయత్నించినా ఫలితం ఉండటం లేదని, ఉన్నతాధికారులు స్పందించి పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కాగా రైతుల మెరుపు ఆందోళనతో అద్దంకి నార్కట్‌పల్లి రహదారిపై సుమారు 3 గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటీనా ఘటనా



స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. యూరియా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సత్వరమే పంపిణీ జరిగేలా చూస్తామని పోలీసులు స్థానిక అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. దీంతో అన్నదాతలు ఆందోళనను విరమించి రహదారిపై నుంచి పక్కకు తప్పుకోగా.. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## భారత్ బంద్ కు వామపక్షాల మద్దతు

**ముద్ర, హైదరాబాద్:**

కేంద్ర కార్మిక సంఘాలు గురువారం చేపట్టనున్న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెకు సీపీఐ, సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీల రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, జాన్ వెస్లీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాపితంగా సమ్మెకు మద్దతుగా జరిగే సమావేశాలు, ఊరేగింపులు, ప్రదర్శనలలో సీపీఐ, సీపీఎం శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు. పోరాడి సాధించిన కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కార్పొరేట్లకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చినందుకు కార్మిక సంఘాలు ఈ సమ్మెకు పిలుపునిచ్చాయని వారు తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన వ్యవసాయానికి కనీస మద్దతు ధర ఇవ్వడం లేదని మండిపడ్డారు. గతంలో రైతుల ఆందోళనకు తలొగ్గి కేంద్రప్రభుత్వం రైతులకు ఇచ్చిన



హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. తాజా అమెరికాతో వాణిజ్య ఒప్పందంతో దేశ రైతుల ప్రయోజనాలను అమెరికా వద్ద కేంద్ర ప్రభుత్వం తాకట్టుపెట్టిందని అన్నారు. ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేట్‌పరం చేసి కార్పోరేట్స్‌కు దేశ సంపదను దారపోస్తున్నదని తెలిపారు. అధిక పన్నులతో సామాన్యులపై భారం మోపుతున్నదని అన్నారు. ఈ అన్ని అంశాలపై గురువారం జరిగే దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెలో ప్రజలందరూ మద్దతు తెలిపి జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## హాట్ టాపిక్

# అజ్ఞాత మావోయిస్టుల లేఖలు?



ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్‌లోని నలుగురు కీలక మంత్రులకు అజ్ఞాత వ్యక్తుల నుంచి బెదిరింపు లేఖలు రావడం కలకలం రేపుతోంది. మంత్రులు కందుల దుర్గేష్, అనగాని సత్య ప్రసాద్, సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్రలకు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు అందాయి. అయితే, గతంలో నక్సల్స్ పేరుతో ఇలాంటి లేఖలు వచ్చేవి కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో వీటి పై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఈ మంత్రులు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు చెందిన వారు కాదు.. అలాంటి వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నవారు కూడా కాదు.

దేశవ్యాప్తంగా మావోయిస్టుల ఏరివేత ముమ్మరంగా సాగుతున్న తరుణంలో, ఈ లేఖలు ఎక్కడి నుంచి వచ్చాయనేది చర్చనీయాంశంగా మారింది. బెదిరింపులు ఇవ్వడానికి ఇప్పుడు మావోయిస్టులు ఎక్కడున్నారన్న ప్రశ్న వస్తోంది. అగ్రనేతలంతా ఎన్ కౌంటర్లలో ప్రాణాలు కోల్పోవడమో, లేదంటే అనారోగ్య కారణాలతో లొంగిపోవడమో జరిగింది. మిగిలిన అతి కొద్దిమంది కూడా ఛత్తీస్‌గఢ్ వంటి దట్టమైన అడవుల్లో ఎక్కడో ఒకచోట ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి, సొంత ఉనికిని కాపాడుకోవడమే గగనమైన వేళ, మంత్రులకు లేఖలు రాసేంత సాహసం వారు చేస్తారంటే ఎవరూ నమ్మడం లేదు.

కేంద్ర ప్రభుత్వం కూడా నక్సల్స్ విషయంలో అత్యంత కఠినంగా ఉంది. వచ్చే మార్చి 31వ తేదీ లోపు భారతదేశాన్ని నక్సల్స్ రహిత దేశం గా ప్రకటించాలని కేంద్ర హోం శాఖ ఇప్పటికే గడువు విధించుకుంది. అడవులను జల్లెడ పడుతున్న బలగాల ధాటికి నక్సల్స్ మూలాలు పూర్తిగా కనుమరుగవుతున్నాయి. వారు ఇలాంటి హెచ్చరికలకు దిగడం అసాధ్యమనే వాదన వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ లేఖలు నక్సలైట్లు రాసినవి కావని, కేవలం పబ్లిసిటీ పిచ్చితో లేకపోతే మంత్రుల్ని బెదిరించడానికి ఆకతాయిల పనేనని అనుమానిస్తున్నారు.

ప్రస్తుతం పోలీసులు ఈ లేఖల మూలాలను వెతికే పనిలో పడ్డారు. నిఘా వర్గాలు కూడా వీటిని సీరియస్‌గా తీసుకుని రాసిన వారిని బయటకు తీసుకురానున్నారు. ఎవరు ఏ ఉద్దేశంతో రాసినా, ప్రజా ప్రతినిధులకు భద్రత పెంచడంతో పాటు, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసు శాఖ స్పష్టం చేస్తోంది.

# ఆరోగ్య భారత్ కల సాకారమయ్యేనా?

**- కార్పొరేట్ కోరల్లో సామాన్యుడి ప్రాణం!**

**- ప్రభుత్వ నియంత్రణ వైఫల్యమా?**

భారతదేశం నేడు ఒక విచిత్రమైన సంధి కాలంలో ఉంది. ఒకవైపు ప్రపంచ ఆర్థిక వేదికలపై అగ్రగామిగా వెలుగుతున్నామన్న ఆత్మవిశ్వాసం, మరోవైపు దేశంలోని సామాన్యుడికి కనీస వైద్యం అందించలేకపోతున్నామన్న చేదు నిజం మనల్ని నిరంతరం వెంటాడుతున్నాయి. 2047 నాటికి 'వికసిత భారత్' అంటూ మనం వేసుకుంటున్న రంగుల చిత్రంలో ఆరోగ్య రంగం అనే పునాది మాత్రం బీటలు వారుతూనే ఉంది. ఇటీవల 'లాన్సెట్ కమిషన్' వంటి అంతర్జాతీయ వేదికలు వెల్లడిస్తున్న వాస్తవాలు మనల్ని ఒకటే ప్రశ్నిస్తున్నాయి: మనం నిర్మిస్తున్న ఆరోగ్య వ్యవస్థ నిన్నటి రోగాల కోసం సిద్ధం చేసిన కాలం చెల్లిన నమూనానా లేక రేపటి తరం అవసరాలను తీర్చే ఆధునిక వ్యవస్థా? ఆర్భాటపు ప్రకటనలు, అంకెల గారడీ మధ్య సామాన్యుడి ప్రాణం ఇంకా గాలిలోనే దీపమై మిగిలిపోతోంది. ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న గణాంకాలకు, క్షేత్రస్థాయిలో రోగి అనుభవిస్తున్న నరకానికి మధ్య అగాధం నానాటికీ పెరుగుతోంది.

గత ఎనిమిదేళ్లుగా 'ఆయుష్మాన్ భారత్' పేరుతో మనం ఒక మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్నాం. పది కోట్లకు పైగా ఉచిత చికిత్సలు, రెండు లక్షల కోట్ల రూపాయల ప్రజల సొమ్ము ఆదా అంటూ ప్రభుత్వ గొంతులు వినిపిస్తున్న అంకెలు వినడానికి ఇంపుగానే ఉన్నాయి. కానీ, ఈ అంకెల వెనుక దాగున్న అసలు సిసలైన 'అయోమయం' అత్యంత భయంకరమైనది. చేతిలో బీమా కార్డు ఉన్నప్పటికీ, ఆసుపత్రి గడప తొక్కగానే రోగికి ఎదురయ్యే అవమానాలు, గంటల కొద్దీ నిరీక్షణ, అదనపు వసూళ్లు, పడకల కొరత మన వ్యవస్థాత్మక వైఫల్యానికి నిలువుటద్దం. పథకాల పరిధి పెరగడం గొప్ప విషయమే కావచ్చు, కానీ ఆ సేవల్లో నాణ్యత మచ్చుకైనా కనిపించకపోవడం అత్యంత దారుణం. గణంకాలతో గెలిచామని సంబరపడుతున్న పాలకులు, క్షేత్రస్థాయిలో ఉన్న రోగి ఆవేదనను వినలేకపోవడం శోచనీయం. కేవలం కార్డులు పంచడం వల్ల ఆరోగ్యం రాదు, ఆ కార్డుకు తగ్గ గౌరవం ఆసుపత్రిలో దొరికినప్పుడే ఆ పథకానికి సార్థకత చేకూరుతుంది.

మన ఆరోగ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న అతిపెద్ద శాపం దాని 'ఆసుపత్రి కేంద్రిత' ధోరణి. వ్యాధి ముదిరిన తర్వాత ఆసు




పత్రికి వెళ్లే రోగిని ఒక వినియోగదారుడిలా చూసే కార్పొరేట్ సంస్కృతి మనల్ని పూర్తిగా ఆవహించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ( పి హెచ్ సి) నేడు దిక్కులేని దీపాల్లా మారాయి. గ్రామాల్లో కనీసం జ్వరం వస్తే పారాసిటమాల్ ఇచ్చే నాథుడు లేక, గర్భిణీలు ప్రసవ వేదనతో కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సి రావడం మన ఆధునిక నాగరికతకే మచ్చ. నివారణే ప్రాధాన్యంగా ఉండాల్సిన వ్యవస్థ, కేవలం 'వ్యాపారమే' పరమావధిగా సాగుతోంది. నివారించగలిగే వ్యాధులకు కూడా వేల రూపాయలు వసూలు చేసే కార్పొరేట్ మాఫియాను కట్టడి చేయడంలో ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోంది. ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు లేకపోవడం, మందుల కొరత వెన్నాడుతుండటం వంటి అంశాలు మనం ప్రాథమిక వైద్యాన్ని ఎంతగా నిర్లక్ష్యం చేస్తున్నామో చెబుతున్నాయి.

మరోవైపు, దేశంలో మారుతున్న వ్యాధుల సరళి మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అంటువ్యాధులను జయించామని చంకలు గుద్దుకుంటున్న తరుణంలోనే, మధుమేహం, రక్తపోటు, గుండెపోటు వంటి జీవనశైలి వ్యాధులు ప్రతి ఇంటినీ పలకరిస్తున్నాయి. వీటికి కావాల్సింది మందుల షాపులు కాదు, నిరంతర ఆరోగ్య పర్యవేక్షణ మరియు అవగాహన. కానీ మన దగ్గర అన్నీ 'ప్యాచ్‌వర్క్' పనులే. బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి కేటాయిస్తున్న అరకొర నిధులు మన ప్రాధాన్యతలను ఎగతాళి చేస్తున్నాయి. గత రెండు దశాబ్దాలుగా జీడీపీలో ప్రజారోగ్య వ్యయం ఒక శాతం దగ్గరే కునారిల్లుతుండటం మన పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనం. అభివృద్ధి చెందిన దేశాలు తమ ఆదాయంలో అధిక భాగాన్ని ప్రజల ఆరోగ్యం కోసం ఖర్చు చేస్తుంటే, మనం మాత్రం అంకెలను మారుస్తూ కాలం గడిపేస్తున్నాం. పేదవాడి ఆరోగ్యం కంటే పథకాల ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోందనేది చేదు నిజం.

డిజిటల్ హెల్త్ మిషన్, హెల్త్ ఐడీలంటూ మనం చేస్తున్న హడావుడి చూస్తుంటే, ఆకలితో ఉన్నవాడికి ఆధార్ కార్డు ఇచ్చినట్లుగా ఉంది. డేటా సేకరించడం వల్ల రోగి రోగం నయం కాదు. ఆ డేటా ఆధారంగా తక్షణమే అంబులెన్స్ అందేలా, ఆసుపత్రిలో బెడ్ దొరికేలా వ్యవస్థను పటిష్టం చేయాలి. కేవలం సాంకేతికతతో కాలం గడిపేయడం వల్ల ఒరిగేదేమీ లేదు. ప్రైవేట్ రంగం దోపిడీని అరికట్టలేని అశక్తత, ప్రభుత్వ ఆసుపత్రుల దుస్థితిని మెరుగుపరచలేని నిర్లక్ష్యం మన ఆరోగ్య వ్యవస్థను అధోగతికి తొక్కుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రులు ఇచ్చే బిల్లులు సామాన్యుడి వెన్ను విరుస్తుంటే, ప్రభుత్వ నియంత్రణ సంస్థలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. కార్పొరేట్ శక్తుల లాభాపేక్ష ముందు సామాన్యుడి ప్రాణం బలికావాల్సిందేనా? ఇది పాలకుల వైఫల్యం కాదా?

ఇప్పటికైనా మేల్కోకపోతే, 2047 నాటికి మనం చూసేది వికసిత భారతాన్ని కాదు, రోగగ్రస్త భారతాన్ని. పథకాల కవరేజీ కంటే సేవల నాణ్యతపై, కాగితాల మీద సంతకాల కంటే క్షేత్రస్థాయి ఫలితాలపై దృష్టి పెట్టాలి. వికేంద్రీకరణ ద్వారా అధికారాలను కింది స్థాయికి బదిలీ చేయాలి. జిల్లా స్థాయిలోనే వైద్య సౌకర్యాలు మెరుగుపడాలి. ఆశా కార్యకర్తలను, స్థానిక సంస్థలను భాగస్వాములను చేస్తూ ఒక సమగ్ర మార్పును తీసుకురావాలి. అరకొర సంస్కరణలతో కాలం గడపడం మానేసి, వ్యవస్థను మూలాల నుండి ప్రక్షాళన చేయడమే నేటి అవసరం. లేదంటే, మనమంతా అద్భుతమైన అంకెల వెనుక అస్థిరమైన జీవితాలను గడుపుతూనే ఉండాలి. ఆరోగ్యకరమైన భారతం కేవలం నినాదాల వల్ల కాదు, నిబద్ధతతో కూడిన నిర్మాణాత్మక మార్పుల వల్లే సాధ్యమవుతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రకటనల మోజు వీడి, ప్రజా ఆరోగ్యంపై వాస్తవిక పెట్టుబడులు పెట్టాలి

**- వెంక గారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్**
**విశ్లేషణ**
**9848559863**



# స్వామి దయానంద సరస్వతి గొప్ప మార్గదర్శకుడు



స్వదేశీ' భావనకు జన్మనిచ్చిన గొప్ప మార్గదర్శకుడు, ఆర్య సమాజ స్థాపకుడు స్వామి దయానంద సరస్వతి అసలు పేరు మూల్ శంకర్ తివారి. ఈయన1824 ఫిబ్రవరి12న గుజరాత్ లోని టంకార గ్రామంలో కర్షన్జీ లాల్జీ తివారి,యశోధబాయ్ దంపతులకు జన్మించారు.14 సంవత్సరాల వయస్సులో అతను తన తండ్రితో కలిసి శివాలయంలో జాగరణ చేస్తుండగా దేవుని ముందు ఉంచిన నైవేద్యాలకు ఎలుకలు ఆకర్షితులై దేవుని విగ్రహం పైకి ఎక్కి అపవిత్రం చేయడం చూసి అర్థం లేని విగ్రహారాధన పట్ల విరక్తి చెందాడు.తన మామ మరణంతో కలత చెంది మత పరమైన సందేహాలను నివృత్తి చేసుకోవడానికి స్వామి దయానంద సరస్వతి గొప్ప మార్గదర్శకుడు

యోగా,శారీరక శిక్షణ అవసరం ఉందని గుర్తించాడు.తన వివాహంను వ్యతిరేకిస్తూ ఇంట్లో నుంచి వెళ్ళిపోయి1845 సంవత్సరం నుంచి 1860 వరకు దాదాపు 15 సంవత్సరాలు మతపరమైన సత్యాన్వేషణ కోసం భారత దేశం అంతటా పర్యటించారు.1864లో స్వామి విరజానందకు శిష్యుడిగా మారి వేద విద్యను పూర్తి చేశారు.భారత దేశంలో వైదిక మత పునః స్థాపనకై తన జీవితాంతం కృషి చేశారు.వేదాలలో చెప్పినట్లుగా ఉన్నతమైన భావాల ద్వారా విశ్వ మానవాళికి ఉపయోగపడే పది సార్వత్రిక సూత్రాలను ప్రకటించి 1875 ఏప్రిల్ 10 న నేటి ముంబైలో ఆర్య సమాజం స్థాపించారు. విద్యుత్ వాడకంలాంటి సాంకేతిక విషయాలు వేదాలలో ఉన్నాయని బలంగా ప్రచారం చేశారు. బాల్యవివాహాలను, కులాచారాలను, అంటరానితనం, వ్యతిరేకిస్తూ వితంతు పునర్వివాహలను సమర్ధించారు.

అన్ని కులాల వారికి వేద అధ్యాయాన్ని అందుబాటులోకి తెచ్చి విద్యా ధార్మిక సంస్థలను స్థాపించారు. మహర్షి దయానంద సరస్వతి మొత్తం 70కి పైగా గ్రంథాలను రచించి వాటిలో ఆరు వేదాంగాలపై వివరణ ఇచ్చారు.ఆయన రచించిన వాటిలో సత్యార్థ ప్రకాష్,సంస్కార విధి,ఋగ్వేదాది భాష్య భూమిక,ఋగ్వేద భాష్యం ముఖ్యమైనవి.1886లో బాలికల గురుకులాలు,దయానంద్ ఆంగ్లో–వేదిక్ పాఠశాలలు మరియు కళాశాలలు స్థాపించబడ్డాయి.మహాత్మా హన్స్‌రాజ్ ఆధ్వర్యంలో లాహోర్‌లో మొదటి ఆంగ్లో వేదిక్ పాఠశాల ఏర్పాటు చేయబడింది.చివరకు ఒక సంస్థానాధీశుడిపై తీవ్రమైన బహిరంగ విమర్శలు చేసిన తర్వాత దయానంద సరస్వతి 1883 అక్టోబర్ 30 న మరణించారు. మహారాజు మద్దతుదారులలో ఒకరు ఆయనకు విషమిచ్చి ఉండవచ్చని సూచించే పరిస్థితులలో ఈ మరణం సంభవించింది,కానీ ఆ ఆరోపణ కోర్టులో ఎప్పుడూ రుజువు కాలేదు.పంతొమ్మిదవ శతాబ్దం చివరలో ఆయన ఇచ్చిన 'వేదాల వైపుకు తిరిగి వెళ్ళండి' అనే పిలుపు ప్రపంచవ్యాప్తంగా విస్తృతమైన సామాజిక, నైతిక పరివర్తనకు నాంది పలికింది, అది నేటికీ కొనసాగుతోంది.ఆయన స్థాపించిన ఆర్య సమాజం జాతీయవాద స్ఫూర్తిని నెలకొల్పిందని అనడంలో సందేహం లేదు.

**(ఫిబ్రవరి 12న మహర్షి దయానంద సరస్వతి జయంతి సందర్భంగా)**

**- ఆళవందార్ వేణు మాధవ్**

**8686051752, హైదరాబాద్.**



# మొబైల్ మాయలో నేటి యువత



ప్రపంచంలో అనేక విషయాల మార్పులతో పాటు,శాస్త్ర సాంకేతికతలో మరియు వైజ్ఞానిక రంగంలో నూతన ఒరవడికి దారులు ఏర్పాడ్డాయి.ప్రస్తుత్త కాలంలో అతి ప్రధానంగా తీవ్రమైన ప్రభావం చూపుతూ సమాజానికి అదుపుతప్పిన సరికొత్త అలవాట్లను పరిచయం చేస్తున్న సాంకేతిక సాధనాలలో ఒకటి మొబైల్. దీనిని చరవాణి,దూరవాణి,సెల్ ఫోన్ అని వివిధ పేర్లతో పిలువబడుతున్న దీని లక్ష్యం మాత్రం ఒక్కటే. దూరంగా ఉన్న వాళ్ల క్షేమ సమాచారాన్ని,వివిధ విషయాలను తెలుసుకోవడం.కానీ నేటి కాలంలో ఈ మొబైల్స్ వల్ల దూరంగా ఉన్న వాళ్ల విషయాలను తెలుసుకోవడం దేవుడుయేరుగు పక్కన ఉన్న వారిని మరియు చుట్టూ ఉన్న పరిసరాలను పట్టించుకోవడమే కరువు యింది. ఈ మధ్య కాలంలో అనగా కొన్ని సంవత్సరాల నుండి మొబైల్స్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. ఒక సర్వే ప్రకారం మన భూలోక జనాభా 7 బిలియన్లు అయితే అందులో 5బిలియన్ల మొబైల్స్ వాడకంలో ఉన్నాయాట!ఈ ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒకరికి సెల్ ఫోన్ అనేది ఒక అత్యవసర వస్తువుగా మారిపోయింది.నేటి సమాజంలో ఉన్నతమైన స్థాయిలో ఉన్న వ్యక్తిని మొదలుకొని స్కూల్ కి వెళ్ళే పిల్లవాడికి,కాలేజీ కి వెళ్ళే యువతీయువకులకి మరియు వృద్దాప్యదశలో ఉన్న వృద్ధుల వరకూ మొబైల్స్ వినియోగం ఊపందుకుంది. మంచి ఆలోచనాలతో,ఒక గొప్ప ఆశయంతో కనుగొని

మొబైల్స్ ను వాడుకోవడానికి శాస్త్రవేత్తలు అందుబాటులోకి తీసుకచ్చారు. కానీ నేటి తరాన్ని,సమాజాన్ని ప్రస్తుత్తం ఆ మొబైల్స్ దారుణంగా వాడుకుంటున్నాయి.గంటల కొద్దీ అనవసరమైన విషయాలగురించి,పనికిమాలిన అవసరాల గురించి చాలా మంది మొబైల్స్ తో ఆడుకుంటున్నారు.మొబైల్స్ కి అనుసంధానం అయిన వివిధ సోషల్ మీడియా కు సంబంధించిన ఫేస్ బుక్,వాట్సాప్,ఇన్ స్టాగ్రామ్ ఇలా మొదలైన వాటిలో విద్వేషపూరితమైన, అసందర్భమైన విషయాలను అనేక రకాలుగా పోస్టుల పెడుతూ వికృతనాదాన్ని పొందుతున్నారు. కొంత మంది మాత్రం ఎదుటి వాళ్ల మనో భావాలను విలువలను గాలికి వదిలేసి స్టేటస్ లు ,ఫోటోలు,విడియో లు అప్ లోడ్ చేస్తూ రాక్షసానాదం పొందుతున్నారు.వ్యక్తిగతమైన,ఉన్నతమైన,విజ్ఞానపరమైన చరిత్రలను,తెలియని ఎన్నో మంచి విషయాలను తెలుసుకోవడానికి వినియోగించుకోవాల్సిన మొబైల్స్ ను,సాంకేతికతను ఎందుకు పనికిరాని విషయాలకు వాడుతూ ఒక ఉన్మాదపూరిత వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.కనీసం పక్కన ఉన్న వారిని ప్రేమగా,ఆపాయ్యత గా పలకరించే మానవ సంబంధమైన విలువలను సైతం ఈ మొబైల్స్ పక్కదారి పట్టిస్తున్నాయి అనడంలో ఆశ్చర్యం లేదు.నేటి సమాజంలో చాలా మంది వారికి సంబంధించిన వ్యక్తిగతవిషయాలను మొబైల్స్ ద్వారా వివిధ సోషల్ మీడియాలో బహిరంగంగా ప్రచారం చేసుకుంటూ,అల్లరిపాలు అవుతూ,ఆర్థికంగా నష్టపోతూ,కుటుంబ గొడవలతో మానసిక ఆవేదనకు గురి అవుతూ ఆత్మహత్య చేసుకున్న సంఘటనాలు మనం చూస్తూనే ఉన్నాం.అంతేకాకుండా అధిక సమయం మొబైల్ వాడకం వల్ల దాని నుండి వెలువడే రేడియేషన్ తో అనారోగ్య సమస్యలు వ్యాపిస్తాయాని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మితిమీరిన పోకడలతో,ఎక్కువ సమయం మొబైల్ వినియోగం పై ప్రతి ఒకరం దృష్టి పెట్టి,ఎవరికి వారు నిత్య జీవితంలో మొబైల్ వాడకం పట్ల నియంత్రణ కలిగి ఉండి ఉన్నతమైన విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని అలవర్చుకోని మంచి నడవడికకు నాందిఅవ్వాలి.అవసరాలకు అనుగుణంగా సాంకేతికతను, మొబైల్స్ ను వినియోగించాలి.అది అందరికీ ఆర్యోగకరం,ఆదర్శనీయం.వీని వాడకం తగ్గించాలి. అవసరం మేరకే వాడేలా నిర్ణయం తీసుకోవాలి.వారం లో ఒక్క రోజు అయిన పూర్తిగా సెల్ ఫోన్ ముట్టకుండా వుండాలి.సొల్లు కబుర్లు మానివేయాలి. ముఖ్య విషయములు మాత్రమే మాట్లాడాలి. చిన్న పిల్లలకి సెల్ ఫోన్లు ఇవ్వకుండా తల్లి దండ్రులు జాగ్రత్త పడాలి.

**- కామిడి సతీష్ రెడ్డి,**
**జయశంకర్ భూపాలపల్లి జిల్లా. 9848445134.**
**తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
12.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews


**తెలుగునాట టాప్ 10 ఎన్నికలు – విజేతలు- పార్టీలు**

1962 సార్వత్రిక ఎన్నికలు
విజేత పార్టీ: ఇండియన్ నేషనల్ కాంగ్రెస్
ముఖ్య నాయకుడు: నీలం సంజీవరెడ్డి



## జూబ్లీహిల్స్‌లో పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా

**ముద్ర, హైదరాబాద్ :**



జూబ్లీహిల్స్, ఖానామెట్ ప్రాంతాల్లో జరిగిన భూకబ్జాలపై హైడ్రా చర్యలు చేపట్టి సుమారు రూ.1003 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని కాపాడింది. జూబ్లీహిల్స్‌లో అపోలో ఆసుపత్రి అవుట్ గేట్‌కు ఎదురుగా ఉన్న దాదాపు రెండు ఎకరాల పార్కు స్థలంలో 150గజాల మేర అక్రమ నిర్మాణం చేపట్టిన ఘటనపై స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా దర్యాప్తు చేసింది. పార్కులో 50గజాల మేర చొరబడి మూడు అంతస్తుల నిర్మాణం చేపట్టినట్లు నిర్ధారించి, ఆ నిర్మాణాన్ని బుధవారం కూల్చి వేసింది. అదనంగా మరో 100 గజాల మేర హద్దులు వేసుకుని ఆక్రమణ చేసినట్లు గుర్తించింది. పార్కు భూమిని సొంత వినియోగానికి మార్చుకునే ప్రయత్నాలను అడ్డుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. బాధ్యులపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇక హైటెక్స్ ప్రదర్శన కేంద్రానికి సమీపంలోని ఖానామెట్‌లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా రక్షించింది. ఈ భూమిని గతంలో ఆల్ ఇండియా వెలమ సంఘానికి కేటాయించగా, కేటాయింపుపై న్యాయస్థానం తాత్కాలిక నిలుపుదల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కొంతమంది వెనుక వైపు నుంచి మట్టి పోసి ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని సంఘ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా అధికారులు ఐదు ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కోర్టు తీర్పు వచ్చే వరకు భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

## వ్యాపారులకు కఠిన హెచ్చరికలు

- **నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సుల రద్దు తప్పదని అధికారుల స్పష్టం**

**ముద్ర, కూకట్‌పల్లి :**



కేపీహెచ్‌బీ ప్రాంతంలోని షాపులు, వ్యాపార సముదాయాల యజమానులతో అధికారులు మంగళవారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యాపార నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చట్టబద్ధంగా వ్యాపారాలు నిర్వహించాలని, నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వం నిర్దేశించిన సమయ పరిమితుల్లోనే వ్యాపారాలు కొనసాగాలని, నిర్ణీత సమయం అనంతరం షాపులు తెరిచి ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వ్యాపార సంస్థ వద్ద జీహెచ్‌ఎంసీ అనుమతి, ట్రేడ్ లైసెన్స్, జీఎస్‌టీసీ రిజిస్ట్రేషన్, లేబర్ లైసెన్స్, ఆహార వ్యాపారాల కోసం ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు మరియు పని ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఫుటేజీని భద్రపరచాలని ఆదేశించారు. షాపుల ప్రాంగణంలో జూదం, అసాంఘిక కార్యకలాపాలు వంటి చట్టవిరుద్ధ చర్యలకు తావు ఇవ్వకూడదన్నారు. ఫుట్‌పాత్‌లు, రహదారులు మరియు ఇతర బహిరంగ ప్రదేశాలను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం నేరమని, అటువంటి ఆక్రమణలను సహించబోమని స్పష్టం చేశారు. నిబంధనలు పదేపదే ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, వారి ట్రేడ్ లైసెన్స్, జీఎస్‌టీసీ నమోదు సహా ఇతర అనుమతుల రద్దుకు సంబంధిత శాఖలకు సిఫార్సు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

## ఉప్పల్‌లో శిలాఫలకాల ధ్వంసం.. ఉద్రిక్తత

**ముద్ర, కాప్రా :**

ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన శిలాఫలకాలు ధ్వంసం కావడం కలకలం రేపింది. రూ.116 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శ్రీధర్ బాబు, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి ఇటీవల శంకుస్థాపన చేశారు. కార్యక్రమం జరిగిన మరుసటి రోజే అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇదివరకే ప్రారంభోత్సవ వేడుక సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకుని పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరువర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ఉద్రికత సృష్టించగా, పోలీసుల జోక్యంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. తాజా ఘటనతో మరోసారి ఆ ప్రాంతంలో ఆందోళన వాతావరణం నెలకొంది. అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించేలా ఇలాంటి చర్యలు దురదృష్టకరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిని వెంటనే గుర్తించి చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు పోలీసులను కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## కేపీహెచ్‌బీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అదృశ్యం

**ముద్ర, కూకట్‌పల్లి :**



పనికి వెళ్లిన యువతి తిరిగి ఇంటికి చేరకపోవడంతో కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో కలకలం రేగింది. సైదాబాద్‌కు చెందిన పల్లవి సిండే (26) అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 'మహిళ మిస్సింగ్' కేసుగా నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రకాష్ సిండే కుమార్తె పల్లవి కేపీహెచ్‌బీ కాలనీలోని మంజీరా మెజెస్టిక్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఉన్న కోడ్‌జెన్స్ టెక్నాలజీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఈనెల 9న ఉదయం 9.20 గంటలకు విధులకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. అదే రోజు రాత్రి 8గంటల సమయంలో తన మొబైల్‌ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు కాల్ చేసి, ఆఫీసు నుంచి బయలుదేరినట్లు, ఇంటికి వస్తున్నట్లు తెలిపింది. ఫోన్‌లో ఛార్జింగ్ అయిపోతోందని కూడా చెప్పింది. అనంతరం ఆమె మొబైల్ స్విచ్ ఆఫ్‌గా మారింది. యువతి ఇంటికి చేరకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె సోదరి ప్రసిద్ధ సిండే కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆఫీసు పరిసరాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ, ఆమె ప్రయాణించిన మార్గాలపై దర్యాప్తు చేస్తున్నారు. పల్లవి ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



కొండగల్ లో ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం రేవంత్ రెడ్డి



వనపర్తి లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి లో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సురభి

# పుర పోరు ప్రశాంతం

- **ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు**
- **బారులు తీరిన ఓటర్లు.. పలు జిల్లాల్లో భారీగా పోలింగ్**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్ నగర్ :**

రాష్ట్రంలోని నారాయణపేట, తాండూరు, వనపర్తి, మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పటిష్ట బందోబస్తు నడుమ ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఐదు గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిస్థితిని పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఓట్ల లెక్కింపు ఈనెల 13న నిర్వహించనున్నారు.

**ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం**

మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటేశారు. తాండూరులో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కుటుంబ సమేతంగా ఓటు హక్కు వినియోగించుకోగా, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి కూడా ఓటేశారు. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు. మహబూబ్‌నగర్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తమ ఓటు హక్కును వినియోగించారు. వనపర్తిలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఓటేశారు. వికారాబాద్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, రంగారెడ్డి జిల్లాలో కలెక్టర్ సి. నారాయణరెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ప్రముఖుల ఓటింగ్‌తో పలుచోట్ల పోలింగ్ కేంద్రాల వద్ద ఉత్సాహ వాతావరణం నెలకొంది. శేరిలింగపల్లిలో సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్, ఐపీఎస్ ఇతర అధికారులతో కలిసి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్న సీపీ వివరించారు.

**పోలింగ్ వివరాలు..**

నారాయణపేట మున్సిపాలిటీలో 74.18 శాతం పోలింగ్ నమోదు కాగా, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 67.73 శాతం నమోదైంది. వనపర్తి జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో 75.56 శాతం ఓటింగ్ జరిగింది. వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల్లో 71.82 శాతం పోలింగ్ నమోదు కాగా, పరిగిలో అత్యధికంగా 77.10 శాతం, తాండూరులో 67.54 శాతం నమోదైంది. కొడంగల్‌లో 75.81 శాతం, వికారాబాద్ పట్టణంలో 74.35 శాతం పోలింగ్ నమోదైంది. రంగారెడ్డి జిల్లాలో ఆరు మున్సిపాలిటీల్లో పోలింగ్ సజావుగా సాగిందని అధికారులు తెలిపారు. నారాయణపేట జిల్లా మక్తల్ లోని 6వ వార్డులో బీజేపీ అభ్యర్థి మృతి చెందడంతో ఎన్నిక వాయిదా పడింది.



వికారాబాద్ లో కుటుంబంతో కలిసి ఓటు హక్కు వినియోగించుకుంటున్న కలెక్టర్ ప్రతీక్ జైన్



తాండూరు లో..



ఓటు వేసేందుకు వీల్ చైర్ లో వస్తున్న మహిళ



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి



తాండూరులో



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో..



నారాయణపేటలో..

## కబ్జాల బారిన కేపీహెచ్‌బీ.. గత పదేళ్ల విధ్వంసంపై విచారణ జరిపించాలి

- **114వ డివిజన్ సమస్యలపై కాంగ్రెస్ యువనేత గాధే శివ ఆగ్రహం**

**ముద్ర, కూకట్‌పల్లి :**

గత పదేళ్లలో కూకట్‌పల్లి నియోజకవర్గం, ముఖ్యంగా 114వ కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలో జరిగిన భూ కబ్జాలు, అభివృద్ధి లోపాలపై సమగ్ర విచారణ జరపాలని కాంగ్రెస్ యువనేత గాధే శివ డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో విఫలమయ్యారని, వారి నిర్లక్ష్యంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రజల వినియోగానికి కేటాయించిన పార్కు స్థలాలు గోపాల్ నగర్, కేపీహెచ్‌బీ 6వ ఫేజ్ ప్రాంతాల్లో కబ్జాలకు గురయ్యాయని ఆరోపించారు. కొన్నిచోట్ల జైలు గోడలను తలపించే నిర్మాణాలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. అయితే హైడ్రా, కాంగ్రెస్ చొరవతో కొంత భూమిని కబ్జాల నుంచి విముక్తి కల్పించామని తెలిపారు. కేపీహెచ్‌బీ రమ్య గ్రౌండ్స్‌లో ఎన్టీఆర్ పేరుతో మెమోరియల్ స్కూల్ నిర్మిస్తామని చెప్పి నిధులు సేకరించి, పనులను అర్ధాంతరంగా నిలిపివేశారని ఆయన ఆరోపించారు. అక్కడున్న ఇనుము సామగ్రి కూడా దోచుకెళ్లబడిందని, ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఫోర్త్ ఫేజ్‌లో నిర్మించిన 630ఎల్ఐజీ ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లు ఏళ్లుగా పెండింగ్‌లో ఉండటంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు జారీ చేయలేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో పారదర్శకత లోపించిందని విమర్శించారు. సర్దార్ పటేల్ నగర్, భగత్ సింగ్ నగర్, వసంత్ నగర్, డ్రీమ్ వ్యూ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిందని, వీధి లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పార్కుల్లో మహిళల కోసం కనీస సదుపాయాలు కల్పించలేదని, మహిళా సంఘాలు, జర్నలిస్టులకు సొంత భవనాలు లేవన్నారు. కేపీహెచ్‌బీ పరిసరాల్లో రహదారులపై వాణిజ్య కార్యకలాపాలు పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమయ్యాయని, అత్యవసర వాహనాలకు కూడా దారి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రతినిధులు సమస్యలపై స్పందించడం లేదని, బాధ్యతాయుత నాయకులను ఎన్నుకోవాలని ప్రజలను ఆయన కోరారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 12-02-2026
www.mudranews.in | @mudranews




తెలుగునాట టాప్ 10 ఎన్నికలు – విజేతలు- పార్టీలు

1967 సార్వత్రిక ఎన్నికలు

విజేత పార్టీ: ఇండియన్ నేషనల్ కాంగ్రెస్

ముఖ్య నాయకుడు: కాసు బ్రహ్మానందరెడ్డి



### కరీంనగర్ జిల్లాలో

# సజావుగా మున్సిపల్ ఎన్నికలు

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**ముద్ర, కరీంనగర్:**

రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు–2026 లో భాగంగా కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, మున్సిపాలిటీలకు బుధవారం నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఎన్నికల సరళని పర్యవేక్షించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టరేట్ నుండి ఎన్నికల తీరును పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కౌంటింగ్ ప్రక్రియ కోసం ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ సెంటర్ ను పరిశీలించారు.

కరీంనగర్ లోని రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ కార్యాలయం, జ్యోతినగర్ లోని ఎస్సార్ ఉన్నత పాఠశాల పోలింగ్ స్టేషన్లను కలెక్టర్ సందర్శించారు. సెయింట్ ఆల్ఫోన్స్ హై స్కూల్లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్ ను పరిశీలించారు. ఈ కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన వారికి మొక్కలు అందజేశారు.

**ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా కలెక్టర్**

రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఏరియాలో ఉన్న పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించి పోలింగ్ తీరును పరిశీలించారు.

**కౌంటింగ్ కేంద్రం పరిశీలన**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా ముగియడంతో ఈ నెల 13న జరిగే కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి పరిశీలించారు. ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఓట్ల లెక్కింపు వివరాలను నిర్దిష్ట ఫార్మాట్లో నమోదు చేయాలని అన్నారు. కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.




# రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్రమే కారణం

- బండి సంజయ్.. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చే వాటా గురించి మాట్లాడవా
- ప్రజాస్వామ్యం గురించి గంగుల కమలాకర్ మాట్లాడటం సిగ్గుచేటు
- గంగుల కమలాకర్, బండి సంజయ్ పై సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

**ముద్ర, కరీంనగర్:**

రాష్ట్రంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందని, యూరియా ఇవ్వకుండా మోసం చేస్తోందని బండి సంజయ్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కరీంనగర్ లో మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన యూరియా వాటాను సకాలంలో అందించకుండా బిజెపి సర్కార్ మోసం చేసిందని మండిపడ్డారు. కేంద్రం వాటా నిలిపేసి బదనాం మాత్రం రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కు రైతులు ఓట్లు వేయలేదా.. అని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. యూరియాపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని, రాష్ట్రానికి వచ్చే వాటా విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సుడా చైర్మన్ కోరారు. రైతాంగం దగ్గర రాష్ట్ర ప్రభుత్వాన్ని కావాలనే బదనాం చేసే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. ఇదే సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారని, ఓటుకు పదివేల రూపాయలు ఇచ్చి కొంటున్నారని గంగుల కమలాకర్ చేసిన ఆరోపణ పైన కూడా సుడా చైర్మన్ స్పందించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది టిఆర్ఎస్ ప్రభుత్వమే అని, విచ్చలవిడిగా టిఆర్ఎస్ హయాంలోనే డబ్బుల పంపిణీ జరిగిందని సుడా చైర్మన్ ఆరోపించారు. ఓటర్లను గంగుల కమలాకర్ అవమానిస్తున్నారని అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని బిఆర్ఎస్ కు, కాంగ్రెస్ కు మధ్య పాలనను ప్రజలు తెలుసుకున్నారని సుడా చైర్మన్ అన్నారు..



## కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న బండి సంజయ్




**ముద్ర, కరీంనగర్:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ ఓటు హక్కు వినిమోగించుకున్నారు. కరీంనగర్ 50వ డివిజన్ జ్యోతినగర్ ఎస్సార్ హైస్కూల్ లోని 361 పోలింగ్ బూత్ లో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఓటు వేశారు.

## కరీంనగర్ లో ఓటు వేసిన మంత్రి అడ్లూరి..

**ముద్ర, కరీంనగర్:**

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా తన ఓటు హక్కును కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వినియోగించుకున్నారు. కరీంనగర్ మూడో డివిజన్ లో మంత్రి లక్ష్మణ్ కుమార్ తన ఓటును రెయిన్ బో ఇంగ్లీష్ మీడియం స్కూల్ పోలింగ్ కేంద్రం లో వేశారు.



## 52వ డివిజన్ లో 'అల్ఫోర్స్' నరేందర్ రెడ్డి ఓటు

**ముద్ర, కరీంనగర్:**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు "అల్ఫోర్స్" డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా స్థానిక 52 డివిజన్ లోని ఓటింగ్ కేంద్రంలో ఓటు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడమే కాకుండా సమాజాభివృద్ధిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటు చాలా విలువైనదని ప్రధానంగా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ప్రత్యేకమైన స్థానమున్నదని ఆయన గుర్తు చేశారు. ఓటు ద్వారానే ప్రభుత్వం ఏర్పడుతుందని ఆ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి జరుగుతుందని గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని చెప్పారు. మొట్టమొదటిసారిగా ఓటు వేసేవారు ఆలోచించి సరైన నాయకునికి ఓటు వేసి అభివృద్ధికి చేయూతనివ్వాలని ఆయన పిలుపునిచ్చారు.




## ఓటుహక్కు వినియోగించిన శతాధిక వృద్ధురాలు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

బుధవారం జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో నిర్మల్ మున్సిపాలిటీకి చెందిన గంప భగీరథ అనే 102 సంవత్సరాల వృద్ధురాలు ఓటు హక్కు వినియోగించుకున్నారు స్థానిక గాంధీ నగర్ కు చెందిన భగీరథ తన కుటుంబ సభ్యుల సహాయంతో పోలింగ్ బూత్ కు వచ్చి తన ఓటు హక్కును సద్వినియోగం చేశారు.



# నిర్మల్ జిల్లాలో మున్సిపల్ పోలింగ్ ప్రశాంతం

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల**

**గాజులపేట పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిర్మల్ జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. సాయంత్రం 5 గంటలకు ముగిసిన ఈ. ఎన్నికల్లో అక్కడక్కడ చిన్న ఘటనలు తప్ప ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోలేదు. ఉదయం పోలింగ్ ప్రారంభం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ నిర్మల్ లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. రవి హైస్కూల్, ప్రిన్స్ హైస్కూల్, టీఎన్జీఓ హాల్, ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పోలింగ్ సరళిని స్వయంగా గమనించిన కలెక్టర్, ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ లు ఓటర్లు ఎక్కువగా ఉన్న కేంద్రాల్లో ఓటింగ్ వేగంగా సాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వృద్ధులు, వికలాంగులకు ప్రాధాన్యత కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. మోడల్ పోలింగ్ కేంద్రం ఎదుట ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద ఓటర్లతో కలిసి ఫోటో దిగారు. భైంసాలోని మోడల్ పోలింగ్ కేంద్రాలకు సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. మధ్యాహ్నం మూడు గంటలవరకు నిర్మల్ లో 63 శాతం, ఖానాపూర్ లో 60 శాతం, భైంసాలో 52శాతం చొప్పున జిల్లా వ్యాప్తంగా 59 శాతం ఓటింగ్ జరిగింది.







నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి గాజులపేట పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## మోడల్ పోలింగ్ కేంద్రాల్లో మొక్కల పంపిణీ




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిర్మల్ జిల్లా భైంసా మోడల్ పోలింగ్ స్టేషన్లు 41, 42 లలో ఓటర్లకు మొక్కలు పంపిణీ చేశారు. అధికారుల ఆదేశాల మేరకు ఈ రెండు పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసిన తొలి 100 మందికి మొక్కలు పంపిణీ చేసినట్లు రిటర్నింగ్ అధికారి విజయ్ కుమార్ స్పష్టం చేశారు.

### రోడ్డు ప్రమాదంలో

## యువకుడి మృతి

**ముద్ర, కరీంనగర్:**

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండలంలోని తాడిజెర్రి గ్రామానికి చెందిన శ్రీరాం మహేష్ (35) దుబాయ్ లో పనిచేస్తూ 10 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. భార్య పిల్లలతో కలిసి మధురనగర్ చౌరస్తాలో కిరాయికి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి ఉప్పరమల్యాల రంగరావుపల్లి గ్రామాల మధ్య మహేష్ బైక్ రోడ్డుపై పడి ఉండగా మహేష్ రోడ్డు ప్రక్కన పొలంలో పడి ఉన్నాడు. వాహనం అదుపు తప్పిందా లేక ఏదైనా వాహనం ఢీకొందా తెలియలేదు. తీవ్రంగా గాయపడిన మహేష్ ను స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మహేష్ కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

ఈ ప్రమాదంపై ఫిర్యాదు రాలేదని, వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.

### కరీంనగర్ లో బీజేపీ కార్యకర్తలపై

# పోలీసుల లాఠీఛార్జి







**ముద్ర, కరీంనగర్:**

తెలంగాణలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ లో పలు చోట్ల ఉద్రిక్త పరిస్థితులు చోటు నెలకొన్నాయి. కరీంనగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ వద్ద గుమిగూడిన బీజేపీ కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జి జరిపి వారిని చెదరగొట్టారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు ఆరు గురికి గాయాలయ్యాయి. దీంతో పోలీసుల తీరును నిరసిస్తూ బీజేపీ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు మాట్లాడుతూ 58వ డివిజన్ లో బీఆర్ఎస్ నేతలు దొంగ ఓట్లు వేయిస్తున్నారని చెబుతుంటే వినకుండా పోలీసులు తమపై లాఠీఛార్జి చేశారని మండిపడ్డారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
12.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



తెలుగునాట టాప్ 10 ఎన్నికలు విజేతలు-పార్టీలు

1978 సార్వత్రిక ఎన్నికలు విజేత పార్టీ: ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఇందిరా) ముఖ్య నాయకుడు: మర్రి చెన్నారెడ్డి



## ఓటు హక్కు వినియోగించుకున్న అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, కుటుంబ సభ్యులతో కలసి 3 వ వార్డు రాయగిరి లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి చేరుకుని నిర్భయంగా ఓటు వేయాలని, స్థానిక స్వపరిపాలనలో భాగస్వాములు కావాలని సూచించారు.



## ఐదు మున్సిపాలిటీల్లో ఎన్నికలు ప్రశాంతం

- **పోలింగ్ సరళి, పోలీస్ బందోబస్త్ పరిశీంచిన పోలీస్ కమిషనర్**

**ముద్ర, ఖమ్మం:**

జిల్లాలో కొనసాగుతున్న ఐదు మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగిందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఎదులాపురం, వైరా, కల్లూరు, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీలో కొనసాగుతున్న ఎన్నికల నేపథ్యంలో పలు పోలింగ్ స్టేషన్లను పోలీస్ కమిషనర్ సందర్శించారు. పోలీస్ బందోబస్త్ ఎన్నికల భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు, రామానుజం, కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తో పోలింగ్ ప్రక్రియ, బందోబస్త్ ఏర్పాట్లపై చర్చించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్ పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛా యుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకోవాలని, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు.

## ఆర్డీఓ కార్యాలయాలలో ఆర్టీఐ కమిషనర్ తనిఖీ

**ముద్ర, ఖమ్మం :**

సమాచార హక్కు చట్టం ఆర్టీఐ అమలు తీరును పరిశీలించేందుకు రాష్ట్ర కమిషనర్ పి వి శ్రీనివాస్ రావు ఖమ్మం ప్రభుత్వ కార్యాలయాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎన్ ఎస్ పి క్యాంపు లో ఉన్న సర్కిల్ త్రీ ఇరిగేషన్ కార్యాలయం పాత బస్సు స్టాండ్ సమీపంలోని ఖమ్మం ఆర్ డి ఓ కార్యాలయాలలో తనిఖీలు నిర్వహించి ఆర్ టి ఐ రికార్డు లను పరిశీలించారు. ఇరిగేషన్ కార్యాలయంలో ఆర్టీఐ చట్టం ప్రకారం 4(1) బి కింద పదిహేడు అంశాలతో కూడిన సిటిజెన్ చార్ట్ ఏర్పాటు చేయకపోవడం పై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ టి ఐ చట్టం ప్రకారం క్రింద రికార్డు లను సరిగ్గా నిర్వహించకపోవడం పై కూడా ఆసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్ డి ఓ కార్యాలయం లో ఆర్ టి ఓ రికార్డులను పరిశీలించారు అక్కడ కూడా పరిశీలించి నిర్వహణ తీరును అభినందించారు. అయితే 4(1) బి ప్రకారం పదిహేడు అంశాల తో కూడిన సిటిజెన్ చార్ట్ ఏర్పాటు చేయకపోవడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు



## భద్రాద్రి జిల్లాలో 73.33 శాతం పోలింగ్ నమోదు

- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్**

**ముద్ర, భద్రాద్రి:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 73.33 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీ జితేష్ వి.పాటిల్ తెలిపారు. జిల్లాలోని మూడు అర్బన్ లోకల్ బాడీల పరిధిలో మొత్తం 106 వార్డులు, 288 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1,85,348 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 88,738 మంది, మహిళలు 96,572 మంది, ఇతరులు 38 మంది ఉన్నట్లు వివరించారు. సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 1,35,910 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. అశ్వరావుపేట మున్సిపాలిటీలో మొత్తం 16,850 మంది ఓటర్లలో 12,839 మంది (76.20%) ఓటు హక్కు వినియోగించుకోగా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1,34,775 మంది ఓటర్లలో 99,992 మంది (74.19%) ఓటు వేశారు. యెల్లందు మున్సిపాలిటీలో 33,723 మంది ఓటర్లలో 23,079 మంది (68.44%) ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. పోలింగ్ సమయం సాయంత్రం 5 గంటలకు ముగిసినప్పటికీ, అప్పటికే పోలింగ్ కేంద్రాల లోపల క్యూలో నిలుచున్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పూర్తైన వెంటనే బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సంబంధిత స్ట్రాంగ్ రూములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. స్ట్రాంగ్ రూముల వద్ద తగిన భద్రతా సిబ్బందిని నియమించి నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని వెల్లడించారు.





# ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

- **పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం 6 మున్సిపాలిటీ లలో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో భాగంగా పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో, చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెంలో, భువనగిరి బీచ్ మహల్ లోని జిల్లా పరిషత్ హై స్కూల్లో, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని కొత్త గుండ్లపల్లిలో, ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో ఏర్పాటుచేసిన గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు విశేష ఉత్సాహంతో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు.

**ఏర్పాట్ల పరిశీలన..**

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి మండలంలోని దివ్య బాల విద్యాలయంలో భువనగిరి, చౌటుప్పల్, పోచంపల్లి, యాదగిరిగుట్ట, ఆలేరు, మోత్కూర్ మున్సిపాలిటీలకు సంబంధించిన కౌంటింగ్ ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- **తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం**

**ముద్ర, ఖమ్మం :**



సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేసింది. మోడీ అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలతో దేశంలో వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోనుందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు తెలిపారు. బుధవారం సమ్మె జయప్రదం కోరుతూ వివిధ ప్రాంతాలలో రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ఇటీవల మోడీ ప్రభుత్వం చేసుకున్న వాణిజ్య ఒప్పందాలతో పలు విదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడంతో భారతదేశంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఇప్పటికే వ్యవసాయ రంగంలో పెట్టుబడులకు ఉత్పత్తి ఆధారంగా వచ్చే ఆదాయానికి మధ్య తీవ్ర వ్యత్యాసం ఉందని పెట్టుబడులకు అనుగుణంగా గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. విదేశీ ఉత్పత్తులు దేశంలో సుంకం లేకుండా దిగుమతి చేసుకుంటే భారతదేశ వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ ఉండదని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించేందుకు మోడీ ప్రభుత్వం యత్నిస్తుందని సుదీర్ఘ పోరాట ఫలితంగా నల్ల చట్టాలను రద్దు చేసినట్లు నటించి తిరిగి దొడ్డిదారిన అమలుకు పూనుకుంటుందని గోవిందరావు ఆరోపించారు. సమ్మెతో మోడీ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేలా రైతులు సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, నాయకులు పగడాల మల్లేష్, కూచిపూడి రవి, శాఖమూరి శ్రీనివాసరావు, రామకృష్ణ, రమేష్, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు

- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**ముద్ర, కొత్తగూడెం:**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కొత్తగూడెం ,ఇల్లందు అశ్వరావుపేటలలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళని పరిశీలించి అక్కడ విధుల్లో ఉన్న అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలతో పాటు ఇల్లందులో స్ట్రాంగ్ రూమ్ ల వద్ద బందోబస్తును పరిశీలించారు. మూడు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

## 'స్వర్ణగిరి'లో వైభవంగా బ్రహ్మోత్సవాలు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



శ్రీ స్వర్ణగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు బుధవారం మూడో రోజు వైభవంగా జరిగాయి. ఉదయం శ్రీ వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యార్చనలు పూర్తి చేశారు. శ్రీ పెరుంబుదూర్‌కు చెందిన శ్రీ శ్రీ శ్రీ ఎంబార్ రామానుజ జీయర్ స్వామి వారు విచ్చేసి భక్తులకు తమ మంగళాశాసనాలు అందజేశారు. సాయంత్రం పల్లకి సేవలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం కల్పవృక్ష వాహనసేవ మహా వైభవంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా స్వామివారు కల్పవృక్ష వాహనంపై విరాజిల్లుతూ భక్తులకు దివ్య దర్శనం ప్రసాదించారు.

## భువనగిరిలో 82.93 శాతం పోలింగ్

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మున్సిపల్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల్లో 82.93 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి హనుమంతరావు 20వ వార్డు పోలింగ్ కేంద్రం బీచ్మహల్ల హైస్కూల్ లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, కుటుంబ సభ్యులతో కలసి 3 వ వార్డు రాయగిరి లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. భువనగిరి మున్సిపల్ పరిధిలో మొత్తం 39 వేల 664 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.




## కోదాడ లో ప్రశాంతంగాముగిసిన పోలింగ్

- **పోలింగ్ సరళిని పరిశీలించిన మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి**

**ముద్ర ప్రతినిధి, కోదాడ:**



కోదాడ మున్సిపాలిటీకి బుధవారం జరిగిన ఎన్నికల ప్రశాంత వాతావరణంలో జరిగాయి . ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఊపందుకుంది . ఓటర్లకు ఎక్కడ అసౌకర్యం కలగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. ఎమ్మెల్యే పద్మావతి , మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ లు పలు వార్డులలో పోలింగ్ సరళి పరిశీలించారు . మధ్యాహ్నం మంత్రి ఉత్తమ్ కోదాడ చేరుకుని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తో ఓటు హక్కు వినియోగించుకుని,ఓటింగ్ జరుగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు . పోలింగ్ జరిగిన 32 వార్డుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సిఐ శివశంకర్ ఆధ్వర్యంలో పటిష్ట పోలీస్ బందోబస్త్ నిర్వహించారు. ఇక సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీలలో కలిపి 79.90 శాతం ఓట్లు పోలయ్యాయని అధికారులు తెలిపారు. హుజూర్నగర్ మున్సిపాలిటీలో 82.88 శాతం, కోదాడ మున్సిపాలిటీ లో 77.05 శాతం , నేరేడుచర్ల మున్సిపాలిటీలో 79.24 శాతం , సూర్యాపేట మున్సిపాలిటీ లో 79.38 శాతం , తుంగతుర్తి మున్సిపాలిటీ లో 88.36 శాతం ఓట్లు పోలయ్యాయి . కోదాడ మున్సిపాలిటీలో మొత్తం 53056 ఓట్లకు 40881 ఓట్లు పోలవ్వగా ఇందులో పురుషుల ఓట్లు 19568 , మహిళా ఓట్లు 19568 , ట్రాన్స్ జెండర్ ఓట్లు 7 పోలయ్యాయని అధికారులు తెలిపారు .



## ఓటు హక్కు వినియోగించుకున్న వందేళ్ల వృద్ధురాలు

**ముద్ర, మోత్కూర్ :**

మోత్కూర్ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా 9వ వార్డు పరిధిలోని కొండాపురం గ్రామంలోని 20వ పోలింగ్ బూత్ లో జామ చెట్ల బావి గ్రామానికి చెందిన బిసు రంగమ్మ (100) సంవత్సరాలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల సిబ్బంది ఏర్పాటుచేసిన వీల్ చైర్ లో వృద్ధురాలని వాలంటీర్స్ పోలింగ్ కేంద్రానికి తీసుకువెళ్లి ఓటు వేయించారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ ఎంతో గొప్పదని ఈ వయసులో తాను ఓటు వేయడం ఆనందంగా ఉన్నదని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
12.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**తెలుగునాట టాప్ 10 ఎన్నికలు – విజేతలు- పార్టీలు**

1983 సార్వత్రిక ఎన్నికలు
విజేత పార్టీ: తెలుగుదేశం పార్టీ
ముఖ్య నాయకుడు: నందమూరి తారక రామారావు (ఎన్.టి.ఆర్)



## ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి

**ముద్ర, సంగారెడ్డి:**

సంగారెడ్డి జిల్లాలోని అందోల్ జోగిపేట మున్సిపాలిటీలో బుధవారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 9 వార్డులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ 13 లో ఓటు వేశారు.



## పోలీసులతో జగ్గారెడ్డి వాగ్వాదం

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో చిన్న వివాదం పెద్ద దుమారం రేపింది. పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి వర్సెస్ పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 34 వ వార్డు ఇందిరా కాలనీలో కాంగ్రెస్ అభ్యర్థిని పోలీసులు అడ్డుకోవడం తో వివాదానికి తెరలేపింది. అగ్రహంతో అక్కడికి చేరుకున్న జగ్గారెడ్డి పోలీసులపై దూకుడు ప్రదర్శించారు. ఒక దశలో అడ్డుకున్న సీఐపై బూతు పురానానికి దిగారు. సీఐ బీఆర్ఎస్ పార్టీకి దశాబ్ద కాలం పాటు తొత్తుగా పనిచేసిన వ్యక్తి కావడంతో కాంగ్రెస్ వారిని అడ్డుకుంటున్నట్లు ఆయన ఊగిపోయాడు. ఇరువై ఆరు సంవ్సరాలుగా ఇప్పటి వరకు పోలింగ్ బూత్ వద్దకు రాదేదన్నారు. అకారణంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని సీఐ టార్గెట్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న విషయం తెలుసుకొని వచ్చినట్లు చెప్పారు. ఓ దశలో పోలింగ్ ఆపేస్తానంటూ పోలింగ్ బూత్ లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా అడీషనల్ ఎస్పీ రఘునందన్ సముదాయించి జగ్గారెడ్డిని అక్కడి నుంచి పంపివేయడంతో సమస్య సద్దుమనిగింది. పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది.



## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



మెదక్ మున్సిపాలిటీలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు పరిశీలించారు. పెద్ద బజార్, పిట్లం బేస్, నవాబ్ పేట్, గర్ల్స్ హైస్కూల్, గోల్కొండ వీధిల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు, స్ట్రైకింగ్ ఫోర్స్ మోహరింపు, క్యూలైన్ నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టిందని తెలిపారు. ఆయన వెంట మెదక్ డిఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ ఇన్ స్పెక్టర్ మహేష్, సీసీఎస్ ఇన్ స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎస్పీ ఇన్ స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఆర్ఐ శైలందర్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది ఉన్నారు.

## ఉపాధి పనుల వివరాలు అందుబాటులో ఉంచాలి

**ముద్ర, హైదరాబాద్:**



గ్రామాల్లో ఉపాధి హామీ పనుల వివరాలు అందుబాటులో ఉంచాలని సిద్దిపేట జిల్లా అడిషనల్ పీడీ శ్రీనివాస్ గౌడ్ ఆదేశించారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ 4వ విడత ప్రత్యేక సమావేశం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 230 పనులు చేపట్టగా.. అందులో మూడు కోట్ల 95 వేల రూపాయలు చెల్లించారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన పనుల వివరాలను ప్రజాదర్బార్‌లో గ్రామపంచాయతీ వారిగా వివరాలను వెల్లడించారు.

గ్రామాల్లో జాబ్ కార్డులు అప్‌డేట్ లేకపోవడంతోపాటు రికార్డులు అస్తవ్యస్తంగా ఉండడం పట్ల సిద్ధిపేట జిల్లా అడిషనల్ పీడీ శ్రీనివాస్ గౌడ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహించి పనులు మొక్కుబడిగా చేపట్టి చేతులు దులుపుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనంతరం అడిషనల్ పీడీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరిగితే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి కూలీలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే వేటు తప్పదన్నారు. రికార్డులు, జాబ్ కార్డు ఎప్పటికప్పుడు చూసుకోవాలని సూచించారు. ఇప్పటికైనా సిబ్బంది పనితీరు మార్చుకోవాలని లేని పక్షంలో శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సతీష్, అంబుజుమాడ్ ఖాజా అరీఫ్ అల్లి, క్వా సి ఓ సంతోష్ రెడ్డి, విజిలెన్స్ మేనేజర్ గణేష్, స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ అంజా గౌడ్, స్టేట్ రిసోర్స్ పర్సన్ అశోక్, ఎంపీడీవో శ్రీనివాస్, పీఆర్ ఏఈ రామ్ కుమార్, ఏపీఓ జనార్దన్, ఎంపీఓ శివకుమార్, సర్పంచులు రేకుల నరసింహారెడ్డి, పర్వేజ్ అహ్మద్, మాసంపల్లి రాజు, సోమని నిర్మాల, ఉశిగారి స్వామి, చిందం శశికాంత్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# మున్సిపల్ ఎన్నికల్లో స్వల్ప ఉద్రిక్తత

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ జిల్లాలో జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా స్వల్ప ఉద్రిక్తత సంఘటనలు చోటుచేసుకున్నాయి. మెదక్ పట్టణంలో 30, 26 వార్డుల్లో ఉద్రిక్తత నెలకొంది. 30వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అరుణార్తి వెంకటరమణ తనపై చేయి చేసుకున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి కిరణ్ తెలిపారు. గుండాయిజం చేస్తున్నారని ఆరోపించారు. 26వ వార్డులో ఒరిజినల్ గుర్తింపు కార్డు లేకుండానే దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని బీఆర్ఎస్ అభ్యర్థి దీపక్ కుమార్ పట్టుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వెంటనే స్పందించి గుర్తింపు పత్రం స్పష్టత కోసం సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోనే ఉన్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అక్కడకి అగ్రహంగా చేరుకోగా డిఎస్పీ ప్రసన్న కుమార్, పోలీసులు అడ్డుకుని పంపించేశారు. బాలికల కళాశాల వద్ద 24, 25, 29 వార్డులకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు తోపాటు రద్దీ రోడ్డు కావడంతో తరచు ఘర్షణలు జరిగాయి. పట్టణంలో అక్కడక్కడ స్వల్ప సంఘటనలు చోటుచేసుకున్నాయి. నర్సాపూర్ లో ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ నెలకొంది. పోలీసులు స్పందించి గొడవ జరగకుండా నాయకులను పంపించేశారు. మరో కేంద్రంలో సెల్ఫోన్లో విషయంలో గొడవ జరగగా శాంతింప చేశారు. రామాయంపేట మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థి తరపున ఇతర వ్యక్తులు డబ్బులు పంచుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఘర్షణకు దిగడంతో పోలీసులు నచ్చజెప్పి పంపారు.

# మెదక్ జిల్లాలో 81.09 % పోలింగ్





మెదక్ లో పోలింగ్ కేంద్రాల సందర్శించిన ఎస్పీ శ్రీనివాసరావు



మెదక్ లో తండ్రితో కలిసి మొదటిసారిగా ఓటేసిన యువకుడు వివేకానంద రెడ్డి



మెదక్: ఓటేసిన కలెక్టర్ రాహుల్ రాజ్ శ్రీజ దంపతులు



మెదక్: ఓటేసిన అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ జిల్లాలో బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 81.09 % పోలింగ్ నమోదైంది. మెదక్ లో 35,879 మంది ఓటర్లు ఉన్నారు. 28,975 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 80.75% పోలింగ్ నమోదయింది. రామాయంపేటలో 13,095 మంది ఓటర్లు ఉండగా, 11,110 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోగా 84.84% పోలింగ్ నమోదు అయ్యింది. నర్సాపూర్ లో 16,876 మంది ఓటర్లు ఉండగా 13,257 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 78.61% పోలింగ్ నమోదయింది. తూప్రాన్ లో 20,259 మంది ఓటర్లు ఉండగా 16,470 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోగా 81.30% పోలింగ్ నమోదయింది.



మెదక్: ఆవుసులపల్లిలో బారులుతీరిన ఓటర్లు

**ఓటేసిన కలెక్టర్ దంపతులు..**

కలెక్టర్ రాహుల్ రాజ్ శ్రీజ దంపతులు మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు గాంధీ నగర్ లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదనపు కలెక్టర్ మెంచు నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవో రమాదేవిలు 5వ వార్డు పరిధిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెదక్ జిల్లా మున్సిపల్ ఎన్నికల సరళిని కలెక్టరేట్ లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ లు పర్యవేక్షించారు.

**పరిశీలకుల సందర్శన..**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు రవి కిరణ్ సందర్శించారు. పలు వార్డుల్లో, పోలింగ్ కేంద్రాల్లో విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, డిఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.



మెదక్ లో ఓటేసిన ఆర్డీఓ రమాదేవి

## బీఆర్ ఎస్ నాయకుల నిరసన

**ముద్ర, హైదరాబాద్:**



కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అధికార పార్టీ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తూ ఎల్లారెడ్డి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో బీఆర్ ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని జాజాల సురేందర్ ఆరోపించారు. డీఎస్పీ, సీఐ, ఎస్సై మూకుమ్మడిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతున్నారని, ఎన్నికల ప్రక్రియను అపహస్యం చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, బీఆర్ఎస్ నిరసనను పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన చేస్తున్న జాజాల సురేందర్, ఇతర బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి ఇతర ప్రాంతాలకు తరలించారు.

## హరిత పోలింగ్ కేంద్రం పరిశీలన

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన హరిత పోలింగ్ కేంద్రాన్ని బుధవారం అదనపు ఎస్పీ మహేందర్ పరిశీలించారు. పోలింగ్ కు సంబంధించిన బందోబస్తు గురించి పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



తెలుగునాట టాప్ 10 ఎన్నికలు – విజేతలు- పార్టీలు
1994 సార్వత్రిక ఎన్నికలు
విజేత పార్టీ: తెలుగుదేశం పార్టీ
ముఖ్య నాయకుడు: ఎన్.టి.ఆర్





# నేడు సార్వత్రిక సమ్మె

- లేబర్ కోడ్ లకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు
- ఐజేయూ సంఘీభావం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి12:**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం నాడు దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరుగనుంది. కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో ఈ సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చారు. దేశంలో ఇప్పటిదాకా అమలులో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. భారతీయ జనతా పార్టీకి అనుబంధంగా ఉన్న బిఎంఎస్ తో సహా దేశంలోని కార్మిక సంఘాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మొండి పట్టుదలతో ఈ కోడ్ లను అమలులోకి తెచ్చింది. కార్మిక వర్గం అనేక పోరాటాల ద్వారా ఇప్పటిదాకా సాధించుకున్న హక్కులు, చట్టాలు ఈ కోడ్ లతో నిర్వీర్యం అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 కార్మిక చట్టాలలో పత్రికా రంగానికి చెందిన 1955 నాటి వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ కూడా ఉంది. వర్కింగ్ జర్నలిస్టులు ఇతర మీడియా సిబ్బంది సర్వీస్ నిబంధనలు, జీత భత్యాలను నిర్ధారించే వేజ్ బోర్డు వంటి వేతన వ్యవస్థలు కూడా దీనితో రద్దయ్యాయి. ఈ సార్వత్రిక సమ్మెకు దేశంలోని అతిపెద్ద జర్నలిస్టు సంఘమైన ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్( ఐజేయూ) కూడా సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

# మాస్ కాపీయింగ్

- చిట్టీలు అందించిన తల్లిదండ్రులు
- మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఘటన

**ముద్ర న్యూస్:**

మహారాష్ట్రలోని బీడ్ జిల్లా చౌసాలాలోని ఓ జూనియర్ కాలేజీలో మాస్ కాపీయింగ్ జరిగింది. ఇంటర్ పరీక్షల కాపీయింగ్‌కు సంబంధించిన ఓ వీడియో బయటపడింది. తమ పిల్లలు ఎలాగైనా పాస్ కావాలని తల్లిదండ్రులు సాహసం చేశారు. పరీక్షా కేంద్రం గోడలు ఎక్కి కిటికీల నుంచి స్లిప్పులు అందించారు. డ్రోన్ కెమెరాలో ఈ దృశ్యాలన్నీ రికార్డయ్యాయి. కాపీ కొట్టకుండా నిజాయతీగా పాస్ అవ్వాలని చెప్పాల్సిన తల్లిదండ్రులే ఇలాంటి అక్రమాలకు పాల్పడటం చూసి నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఇంటర్ సెకండియర్ ఇంగ్లీష్ పరీక్ష జరిగింది. కాలేజీ చుట్టూ ఖాళీ ప్రదేశం ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు క్లాస్ రూమ్ కిటికీల నుంచి విద్యార్థులకు చిట్టీలు అందించారు. కాపీయింగ్ పై నిఘా కోసం విద్యాశాఖ ఏర్పాటు చేసిన డ్రోన్ కెమెరా ఈ దృశ్యాలను షూట్ చేసింది. డ్రోన్ దగ్గరకు రావడం చూసి అక్కడున్న వారంతా పరుగులు తీశారు. ఈ ఘటనపై అధికారులు విచారణకు ఆదేశించారు.

# ఆదర్శం.. యశోద

- ఆక్సిజన్ సిలిండర్ తో వచ్చి ఓటేసిన వృద్ధురాలు

**ముద్ర, హుజూరాబాద్:**

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని 21వ వార్డుకు చెందిన వృద్ధురాలు యశోద(80) మున్సిపల్ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకుని సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ఊపిరితిత్తుల శ్వాసకోశ వ్యాధితో బాధపడుతోన్న ఆమె ఆక్సిజన్ సిలిండర్ సాయంతోనే శ్వాస తీసుకుంటున్నారు. అయినా ఓటు హక్కును వినియోగించాలనే తన సంకల్పాన్ని ఆమె చాటుకున్నారు. యశోదకు కరోనా సమయంలో వైరస్ సోకడంతో ఆమె ఊపిరితిత్తులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి శ్వాసకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఐదేళ్ల నుంచి నిరంతరం ఆక్సిజన్ సిలిండర్‌పై ఆధారపడి జీవిస్తోంది. సిలిండర్ తొలగిస్తే ప్రాణాపాయం ఉన్నట్లు వైద్యులు హెచ్చరించడంతో కుటుంబ సభ్యులు ఆమెకు ఎప్పటికప్పుడు ఆక్సిజన్ సరఫరా అందిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటు ప్రాముఖ్యతపై ఉన్న విశ్వాసంతో యశోద హుజూరాబాద్ పట్టణంలోని 21వ వార్డులోని 41వ పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు. శారీరక అసౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనాలనే ఆమె సంకల్పం అక్కడున్నవారిని ఆకట్టుకుంది.



# సార్వత్రిక సమ్మెకు ఐజేయూ మద్దతు

- నేడు జరిగే సమ్మెకు సంఘీభావం
- నాలుగు లేబర్ కోడ్‌ల ఉపసంహరణకు డిమాండ్
- 29 కార్మిక చట్టాల రద్దుపై ఆందోళన
- మీడియా సిబ్బంది హక్కులు బలహీనమయ్యాయని ఐజేయూ వ్యాఖ్య
- వర్కింగ్ జర్నలిస్టుల చట్టం పునరుద్ధరణ కోరుతూ కేంద్రానికి ఐజేయూ విజ్ఞప్తి
- వేజ్ బోర్డు వ్యవస్థ రద్దును ఖండించిన జర్నలిస్టుల యూనియన్లు
- కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ట్రేడ్ యూనియన్లతో చర్చలు ప్రారంభించాలని ఐజేయూ డిమాండ్



Indian Journalists Union

**ముద్ర, హైదరాబాద్/చండీగఢ్:**

దేశంలో అమలులో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు కార్మిక కోడ్ లకు వ్యతిరేకంగా ఈ నెల 12న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) పూర్తి మద్దతు ప్రకటించింది.ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి, సెక్రెటరీ జనరల్ బల్వీందర్ సింగ్ జమ్ము సంయుక్త ప్రకటనలో ఈ సమ్మెకు సంఘీభావం ప్రకటిస్తూ వర్కింగ్ జర్నలిస్టుల చట్టంతో సహా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక కోడ్ లను తేవడం ద్వారా వివిధ రంగాల కార్మికులకు, ముఖ్యంగా మీడియా సిబ్బందికి లభిస్తున్న చట్టపరమైన రక్షణలు బలహీనపడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు.కొత్త కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కఠిన పోరాటాలతో సాధించుకున్న హక్కులను అవి దెబ్బతీస్తున్నాయని, సమష్టి చర్చా హక్కును బలహీనపరుస్తున్నాయని, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతా ప్రయోజనాలను ప్రభావితం చేస్తున్నాయని వారు పేర్కొన్నారు.ప్రత్యేకంగా 'వర్కింగ్ జర్నలిస్ట్స్ అండ్ అదర్ న్యూస్‌పేపర్ ఎంప్లాయీస్ (కండిషన్స్ ఆఫ్ సర్వీస్) అండ్ మిస్ లేనియస్ ప్రొవిజన్స్ యాక్ట్' ను, వేజ్ బోర్డు వ్యవస్థను కార్మిక చట్టాల ఏకీకరణ పేరుతో రద్దు చేయడాన్ని ఐజేయూ తీవ్రంగా ఖండించింది. ఈ చట్టాలు జర్నలిస్టులు, ఇతర మీడియా సిబ్బంది సర్వీస్ నిబంధనలు, వేతనాలు, వృత్తిపరమైన హక్కులను రక్షించడంలో కీలక పాత్ర పోషించాయని యూనియన్ పేర్కొంది.వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని తిరిగి అమలు చేయాలని, వేజ్ బోర్డు వ్యవస్థను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కె. శ్రీనివాస్ రెడ్డి, బల్వీందర్ సింగ్ జమ్ము డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను రక్షించేందుకు ప్రభుత్వం ట్రేడ్ యూనియన్లతో అర్థవంతమైన చర్చలు ప్రారంభించాలని ఐజేయూ డిమాండ్ చేసింది. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( టీయూడబ్ల్యూజే ) అధ్యక్షుడు కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామ్ నారాయణ కూడా గురువారం నాటి సార్వత్రిక సమ్మెకు మద్దతు ప్రకటించారు.

# రాహుల్ 'ఎప్‌స్టీన్ ఫైల్స్' సెగతో దద్దరిల్లిన సభ!

**ముద్ర న్యూస్:**

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా లోక్‌సభలో బుధవారం హైడ్రామా చోటు చేసుకుంది. విపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా అమెరికా వాణిజ్య ఒప్పందం, బడ్జెట్ కేటాయింపులు.. సంచలన ఎప్‌స్టీన్ ఫైల్స్ గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు సభలో రాజకీయ తుఫాన్ రేపాయి.

**అనిల్ అంబానీ ప్రస్తావన..**

ప్రసంగంలో రాహుల్ గాంధీ అమెరికా న్యాయ శాఖ విడుదల చేసిన డాక్యుమెంట్లను ప్రస్తావిస్తూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో పేరు ఉన్న పారిశ్రామికవేత్త అనిల్ అంబానీపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అసలు ఎప్‌స్టీన్‌కు ఆయనను పరిచయం చేసింది ఎవరు అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పేరును కూడా రాహుల్ ప్రస్తావించడంతో సభలో గందరగోళం



నెలకొంది. దీనిపై బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

**అమెరికా ట్రేడ్ డీల్‌పై విమర్శలు..**

భారత్అమెరికా మధ్య కుదిరిన తాజా వాణిజ్య ఒప్పందంపై రాహుల్ ఘాటుగా స్పందించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి ప్రధాని మోదీ దేశ ప్రయోజనాలను పణంగా పెట్టారని ఆరోపించారు. మనం ఎక్కడ చమురు కొనాలో కూడా అమెరికానే నిర్ణయిస్తుందా? ఇది ఏ ప్రధానమంత్రి చేయని పని అని విమర్శించారు. అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి చేసుకుంటే భారతీయ రైతులు తీవ్రంగా నష్టపోతారని ఈ ఒప్పందం ఏకపక్షంగా సాగిందని దుయ్యబట్టారు.

**మార్షల్ ఆర్ట్స్ ఉదాహరణతో సెటైర్లు..**

రాహుల్ తన ప్రసంగాన్ని ఆసక్తికరమైన పోలికతో ప్రారంభించారు. మార్షల్ ఆర్ట్స్ గురించి ప్రస్తావిస్తూ.. ఎవరైనా మనల్ని పట్టుకున్నప్పుడు భయం వల్ల సరెండర్ అయిపోతాం. ప్రస్తుతం ప్రధాని కళ్లలో ఆ భయం కనిపిస్తోంది. అందుకే ఆయన పార్లమెంట్‌కు ముఖం చాటేస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**ప్రభుత్వ కౌంటర్.. సస్పెన్షన్ల పర్వం**

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, హర్దీప్ సింగ్ పూరీ ఘాటుగా స్పందించారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సరికాదని, సభను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. సభలో చోటుచేసుకున్న నిరసనల నేపథ్యంలో సభా మర్యాదలు ఉల్లంఘించినందుకు గాను దాదాపు ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను బడ్జెట్ సమావేశాల నుంచి స్పీకర్ సస్పెండ్ చేశారు.మొత్తానికి రాహుల్ గాంధీ ప్రసంగం దేశీయ ఆర్థిక విధానాల నుంచి అంతర్జాతీయ కుంభకోణాల వరకు అన్నిటినీ స్పృశించింది. రాబోయే రోజుల్లో ఎప్‌స్టీన్ ఫైల్స్, అదానీ వ్యవహారాలపై మరిన్ని వాదోపవాదాలు జరిగే అవకాశం ఉంది.

# పాకిస్తాన్ కుప్పకూలడం ఖాయం..!

- 21 ఏళ్లలో ఇదే మొదటిసారి..

**ముద్ర న్యూస్:**

దాయాది దేశం పాకిస్తాన్ ఇప్పటికే ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టడుతోంది. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ నుంచి అప్పులు తెచ్చుకుంటేగాని రోజు గడవని పరిస్థితి. మరోవైపు పాకిస్తాన్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు, ఉగ్రవాదం పెంచి పోషించడంతో ప్రముఖ కంపెనీలు ఆ దేశాన్ని వీడుతున్నాయి. గతేడాది అనేక సంస్థలు పాకిస్తాన్‌ను వీడాయి. ఈ నేపథ్యంలో ఆ దేశంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఏమో కానీ, యువకులకు ప్రైవేటు ఉద్యోగాలు దొరకడం లేదు. తాజా అధ్యయనాలు దేశంలో నిరుద్యోగ రేటు రికార్డు స్థాయికి చేరుకుంది. 21 ఏళ్లలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం.




**రికార్డు స్థాయి నిరుద్యోగం..**

లేబర్ ఫోర్స్ సర్వే ఫలితాల ప్రకారం నిరుద్యోగ శాతం పాకిస్తాన్‌లో 7.1కి చేరింది. రెండు దశాబ్దాల్లో ఇది అత్యధికం. ఏటా 30 లక్షల మంది యువకులకు ఉద్యోగాలు సృష్టించాల్సి ఉందని వరల్డ్ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా హెచ్చరించారు. రాబోయే పది సంవత్సరాల్లో 3 కోట్ల ఉద్యోగాల అవసరం ఉందని అంచనా.

**యువత విదేశాల బాట..**

అస్థిర రాజకీయాలు, భద్రతా ఆందోళనలతో నైపుణ్యం ఉన్న విద్యావంతులు దేశం వీడుతున్నారు. విదేశాలకు వెళ్తున్నారు. 2025లో 4 వేల మంది వైద్యులు దేశాన్ని వదిలిపోయారు. ఇతర వృత్తిదారులు కూడా ఇదే పరిస్థితి. పరిశ్రమలు మూతలు, పెట్టుబడుల ఉపశమనం సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి. షెహబాజ్ ప్రభుత్వం ఆర్థిక మార్పులు సాధించామని ప్రకటిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో ఉద్యోగాలు లేకపోవడం, పరిశ్రమల తగ్గుదల నిరుద్యోగ సమస్యను పెంచుతోంది. ఉగ్రవాద దాడులు, అంతర్జాతీయ ఒత్తిళ్లు సంక్షోభాన్ని మరింత పెంచుతున్నాయి.

# ఒక్క క్లిక్‌తో బెస్ట్ ధర..

- ఈకామర్స్‌లో ధరల పోలికకు నూతన టూల్స్

**ముద్ర, బిజినెస్ న్యూస్ :**

ఆన్‌లైన్ షాపింగ్ యుగంలో వినియోగదారుల కొనుగోలు అలవాట్లు పూర్తిగా మారిపోయాయి. కృత్రిమ మేధస్సు (ఏఐ) ట్రెండ్ మధ్య సమయాభావం, బయటకు వెళ్లే అలసట వంటి కారణాలతో ఎక్కువ మంది ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై ఆధారపడుతున్నారు. అయితే ఒకే ఉత్పత్తికి వేర్వేరు ప్లాట్‌ఫామ్‌లలో భిన్న ధరలు ఉండడం, నాణ్యతపై అనుమానాలు తలెత్తడం వినియోగదారులను ఇబ్బంది పెడుతోంది. ఈ నేపథ్యంలో ధరల పోలిక చూపించే సాంకేతిక టూల్స్ వినియోగదారులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. రోజువారీ అవసరాలు, దుస్తులు, గృహోపకరణాలు వంటి వస్తువులు ఫోన్ ఆర్డర్‌తో ఇంటి వద్దకే చేరుతున్నాయి. అయితే పెరిగిన పోటీ కారణంగా ఒకే ఉత్పత్తికి విభిన్న ధరలు ఉండటం వల్ల సమయం, డబ్బు వృథా అవుతున్నాయి. కొన్నిసార్లు మోసపూరిత ఆఫర్లు కూడా ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు పరిష్కారంగా కొన్ని టెక్నాలజీ టూల్స్ అందుబాటులోకి వచ్చాయి. కొనుగోలు చేయాలనుకున్న ఉత్పత్తి లింక్‌ను కాపీ చేసి సంబంధిత ధరల పోలిక వెబ్‌సైట్‌లో https://Flash.co లో పేస్ట్ చేస్తే, వివిధ ప్లాట్‌ఫామ్‌లలో ఉన్న ధరలు ఒకేచోట కనిపిస్తాయి. దీంతో వినియోగదారులు తక్కువ ధరను ఎంపిక చేసుకునే వీలుంటుంది. ఉదాహరణకు ఒక మొబైల్ ఫోన్ ఒక యాప్‌లో రూ.20,000కు ఉంటే, మరొక ప్లాట్‌ఫామ్‌లో అదే ఉత్పత్తి రూ.18,500కు లభించవచ్చు. ఈ విధంగా ధరల పోలిక ద్వారా గణనీయమైన మొత్తాన్ని ఆదా చేయవచ్చు. అదనంగా డిస్కౌంట్లు, డెలివరీ ఛార్జీలు, వినియోగదారుల రేటింగ్‌లు కూడా తెలుసుకునే అవకాశం ఉంటుంది. రెగ్యులర్‌గా ఆన్‌లైన్ షాపింగ్ చేసే వారు వారానికి సుమారు రూ.500 నుంచి రూ.1,000 వరకు ఆదా చేసుకునే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ విధమైన టూల్స్ ఈకామర్స్ పోటీని వినియోగదారుల పక్షాన మలుస్తున్నాయి.



# ఏపీలోనే దోస్తానా

- జనసేన అవసరం టీబీజేపీకి లేదు
- తెలంగాణలో తమకు సొంతంగా ఎదిగేంత శక్తి ఉంది
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

**ముద్ర, నిజామాబాద్:**

బీజేపీకి జనసేనతో దోస్తానా కేవలం ఏపీలోనే ఉందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పష్టం చేశారు. ఆ రాష్ట్రంలో పొత్తు కలిగి ఉన్న జనసేనతో తెలంగాణ బీజేపీకి సంబంధం లేదని తేల్చి చెప్పారు. బీజేపీకి ఏ పార్టీ, ఏ వ్యక్తి మద్దతు అవసరం లేదని వివరణ ఇచ్చారు. తెలంగాణలో బీజేపీ సొంతంగా ఎదిగేంత శక్తి కలిగి ఉందని వెల్లడించారు. బుధవారం నిజామాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. పొత్తుల విషయంలో తేడాలు ఉంటాయని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ రాజకీయాలు వేరుగా ఉంటాయని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించాయని.. ఆ తర్వాత కూడా ఆ రాష్ట్రంలో పొత్తు కొనసాగుతోందని వెల్లడించారు. అయితే తెలంగాణలో మాత్రం అలాంటి పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ చాలా బలంగా ఉందని పేర్కొన్నారు. ఇక్కడ ఇతర పార్టీల మద్దతు తమకు అవసరం లేదని ధర్మపురి అర్వింద్ తేల్చి చెప్పారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
12.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



తెలుగునాట టాప్ 10 ఎన్నికలు – విజేతలు- పార్టీలు

2004 సార్వత్రిక ఎన్నికలు
విజేత పార్టీ: ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ముఖ్య నాయకుడు: వై.ఎస్. రాజశేఖర రెడ్డి



# ప్రశాంతంగా, సజావుగా మున్సి 'పోల్స్'

- 6 మున్సిపాలిటీల్లో 78.99 శాతం పోలింగ్ నమోదు
- మొత్తం 1,76,023 మంది ఓటర్లకు గాను 1,39,044 మంది ఓటు హక్కు వినియోగం
- ఆమన్‌గల్ మున్సిపాలిటీలో అత్యధికంగా 84.8 శాతం పోలింగ్ నమోదు
- అత్యల్పంగా షాద్‌నగర్‌లో 76.24 శాతం పోలింగ్

**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డిజిల్లా :**

జిల్లాలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. షాద్‌నగర్ మున్సిపాలిటీలో ఒకటి, రెండుచోట్లా రాజకీయ పార్టీల కార్యకర్తల మధ్య చిన్నపాటి గొడవలు మినహా ఇతత్రతా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. దీంతో జిల్లాలో(6) ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, ఆమన్‌గల్ మున్సిపాలిటీల పరిధిలో పోలింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది. ఈ మున్సిపాలిటీల పరిధిలో సాయంత్రం 7 గంటల్లోపు 78.99 శాతం పోలింగ్ నమోదైంది. కాగా, జిల్లాలో ఎన్నికలు జరిగిన ఆరు మున్సిపాలిటీల పరిధిలో 1,76,023 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 1,39,044 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 70,318 మంది మహిళలు, 68,725 మంది పురుషులు ఉన్నారు.




**జిల్లాలో మున్సిపాలిటీల పరిధిలో పోలింగ్ వివరాలు**

| మున్సిపాలిటీ | మహిళలు | పురుషులు | మొత్తంఓటర్లు | ఓటేసింది | పోలింగ్ శాతం |
|---|---|---|---|---|---|
| ఆమన్‌గల్ | 8,509 | 8,475 | 16,984 | 14,403 | 84.8 శాతం |
| చేవెళ్ల | 12,791 | 12,579 | 25,371 | 20,661 | 81.44 శాతం |
| మొయినాబాద్ | 16,417 | 16,453 | 32,871 | 26,377 | 80.24 శాతం |
| ఇబ్రహీంపట్నం | 13,252 | 12,741 | 25,993 | 20,392 | 78.45 శాతం |
| శంకర్‌పల్లి | 10,850 | 10,551 | 21,401 | 16,498 | 77.09 శాతం |
| షాద్‌నగర్ | 26,723 | 26,679 | 53,403 | 40,713 | 76.24 శాతం |
| మొత్తం | 88,542 | 88,478 | 1,76,023 | 1,39,044 | 78.99 శాతం |

**ఆమన్‌గల్‌లో అత్యధికంగా 84.8 శాతం పోలింగ్**

జిల్లాలో ఆమన్‌గల్ మున్సిపాలిటీలో అత్యధికంగా 84.8 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ మొత్తం 15 వార్డుల పరిధిలో 30 పోలింగ్ కేంద్రాల్లో 16,984 మంది ఓటర్లకు గాను 14,403 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేవెళ్ల మున్సిపాలిటీలో 81.44 శాతం పోలింగ్ జరిగింది. ఇక్కడ 18 వార్డుల్లో 37 పోలింగ్ కేంద్రాల పరిధిలో 25,371 మంది ఓటర్లు ఉండగా, 20,661 మంది ఓటు వేశారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 52 పోలింగ్ కేంద్రాల్లో 80.24 శాతం పోలింగ్ జరిగింది. ఇక్కడ 26 వార్డుల్లో మొత్తం 32,871 మంది ఓటర్లు ఉండగా, 26,377 మంది ఓటు వేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 78.45 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ 24 వార్డుల పరిధిలోని 48 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 25,993 మంది ఓటర్లకు గాను 20,392 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శంకర్ పల్లి మున్సిపాలిటీలో 77.09 శాతం పోలింగ్ నమోదైంది. ఈ మున్సిపాలిటీలో 15 వార్డుల్లో మొత్తం 21,401 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 31 పోలింగ్ కేంద్రాల ద్వారా 16,498 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలో 28 వార్డులలో మొత్తం 53,403 మంది ఓటర్లకు గాను 76 పోలింగ్ కేంద్రాల్లో 40,713 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. తద్వారా ఇక్కడ 76.24 శాతం పోలింగ్ నమోదైంది.

# జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 74.04 శాతం పోలింగ్ నమోదు


ఉమ్మడి రంగా రెడ్డి జిల్లాలో


నారాయణపేటలో

- నారాయణ పేట మున్సిపాలిటీలో 74.18శాతం.
- కోస్గి లో 74.83 శాతం.
- మక్తల్ లో 70.20 శాతం.
- మద్దూరు లో 79.00 శాతం నమోదు

**ముద్ర, నారాయణ పేట :**

నారాయణపేట జిల్లాలోని నారాయణ పేట, కోస్గి, మక్తల్, మద్దూరు మున్సిపాలిటీలలోని 72 వార్డులకు గాను బుధవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం సాయంత్రం 5గంటల వరకు కొనసాగిన ఓటింగ్ లో నారాయణపేట మున్సిపాలిటీలో 74.18 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే కోస్గి మున్సిపాలిటీ లో 74.83 శాతం, మక్తల్ మున్సిపాలిటీ లో 70.20 శాతం, మద్దూరు మున్సిపాలిటీ లో 79 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో అత్యధికంగా మద్దూరు మున్సిపాలిటీలో 79.00 శాతం, అత్యల్పంగా మక్తల్ మున్సిపాలిటీ లో 70.20 పోలింగ్ శాతం నమోదైంది. నాలుగు మున్సిపాలిటీల ఓవరాల్ పోలింగ్ 74.04 గా నమోదు కాగా, నాలుగు మున్సిపాలిటీలో మొత్తం 90,301 మంది ఓటర్లకు గాను బుధవారం జరిగిన పోలింగ్ ద్వారా 66,859 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాలుగు మున్సిపాలీల్లో మొత్తం 44,122 మంది పురుష ఓటర్లుగాను 32,994 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా, 46,178 మంది మహిళా ఓటర్లకు గాను 33,864 మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# స్వయం ఉపాధితో మహిళలు రాణించాలి




- స్వయం ఉపాధితో మహిళలు రాణించాలి
- మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్

**ముద్ర, కాప్రా :**

మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి కుటుంబాభివృద్ధికి తోడ్పడాలని మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సూచించారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని విద్యా మారుతీ నగర్ కాలనీలో యాహ్వేజీరే గ్రేస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు యంత్రాల శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇటువంటి శిక్షణ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కుట్టు విద్య ద్వారా స్వయం ఉపాధి పొందడంతోపాటు కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ వి. మాథ్యూ, కోశాధికారి వి.మెర్సీ ప్రియా తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి తొలి కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డి



**ముద్ర, మల్కాజిగిరి :**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ తొలి కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు కార్పొరేషన్ ఆర్థిక బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. నగర అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. అనంతరం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మల్కాజిగిరి సమగ్ర అభివృద్ధికి పరస్పర సహకారంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

# ప్రజాసేవే ధ్యేయం.. రాజకీయాల్లో కొనసాగుతా



- మాజీ కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి

**ముద్ర, మల్కాజిగిరి :**

పదవి ఉన్నా లేకున్నా ప్రజాసేవే తన లక్ష్యమని నేరేడ్మెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌గా ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సైనిక్‌పూరి డిఫెన్స్ కాలనీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. పదవి లేకపోయినా ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. నేరేడ్మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్, నేరేడ్మెట్, మధురానగర్ సహా మొత్తం 95 కాలనీలలో గత ఐదేళ్లలో రూ.168 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రహదారులు, బాక్స్ డ్రెయినేజీలు, విద్యుత్ సదుపాయాలు, పార్కుల అభివృద్ధి వంటి కనీస వసతుల కల్పనలో జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సహకారంతో పనిచేశామని చెప్పారు. భవిష్యత్తులో కూడా రాజకీయాల్లో కొనసాగుతూ రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తిరిగి పోటీ చేస్తానని ప్రకటించారు. ఈసందర్భంగా బీజేపీ సీనియర్ నేత ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు, ఎంపీ ఈటెల రాజేందర్ సహకారంతో డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రగతినగర్ చెరువు ప్రగతికి హైడ్రా కృషి

- చెత్త వేయకుండా 1.5 కిలోమీటర్ల మేర హైడ్రా ఫెన్సింగ్

**ముద్ర, హైదరాబాద్ :**

ప్రగతినగర్ చెరువు అభివృద్ధి దిశగా హైడ్రా కీలక చర్యలు చేపట్టింది. చెరువులో దుర్గంధం వెదజల్లుతున్న పూడికను ఇటీవల తొలగించిన హైడ్రా అధికారులు, ఇప్పుడు చెత్త పడకుండా రోడ్డు పొడవునా సుమారు 1.5కిలోమీటర్ల మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. చెరువు మధ్యలో ఉన్న రహదారి ఇరువైపులా చికెన్, మాంసం, చేపల విక్రేతలు, ఇతర దుకాణదారులు జంతు వ్యర్థాలు, చెత్తను పారేస్తున్నారనే ఫిర్యాదులు స్థానికుల నుంచి హైడ్రాకు అందాయి. జంతు వ్యర్థాల కారణంగా తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోందని వారు పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు అక్కడ పేరుకుపోయిన జంతు వ్యర్థాలను తొలగించారు. మొత్తం 145 లారీల చెత్తను క్లియర్ చేశారు. వ్యర్థాలు వేస్తున్న దుకాణదారులకు ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించి ఖాళీ చేయించారు. చెత్తను చెరువులోకి విసరడానికి అవకాశం లేకుండా సుమారు 10మీటర్ల ఎత్తులో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. చెరువులో మురుగు నీరు కలవకుండా అభివృద్ధి పనులు త్వరలో చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. కూకట్‌పల్లిప్రగతినగర్‌లను కలుపుతూ చెరువు మధ్యలో ఏర్పాటు చేసిన రహదారిపై ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించడంతో లక్షలాది మంది స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ సమస్యలు తగ్గి, రాకపోకలు సులభమయ్యాయని పేర్కొన్నారు.






# ఆచూకీ దొరికింది.. అమ్మాయిలు క్షేమం

- జీడిమెట్ల పోలీసుల తక్షణ స్పందన ఫలితం

**ముద్ర, శేరిలింగంపల్లి :**

తండ్రి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన అక్కాచెల్లెళ్లు (21), (14)ను జీడిమెట్ల పోలీసులు క్షేమంగా గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పోలీసుల తక్షణ స్పందనతో ఈ ఘటన సుఖాంతమైంది. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి ఒక గంట సమయంలో ఇద్దరు కుమార్తెలు ఇంటి నుంచి వెళ్లిపోయారని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు, ఆర్టీసీ బస్సుల ప్రయాణ వివరాల ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టి విజయవాడ సమీపంలో వారి ఆచూకీని గుర్తించారు. అనంతరం వారిని సురక్షితంగా తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లలను క్షేమంగా ఇంటికి చేర్చినందుకు తల్లిదండ్రులు జీడిమెట్ల పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇంటీరియర్ డిజైన్ స్టూడియో ప్రారంభం

**ముద్ర, శేరిలింగంపల్లి :**

శేరిలింగంపల్లి డివిజన్‌లోని నార్నె ఎస్టేట్స్ మెయిన్ రోడ్డుపై నూతనంగా ఏర్పాటు చేసిన డీకాన్ మోడ్యులర్ ఫ్యాక్టరీ ఇంటీరియర్ డిజైన్ స్టూడియోను కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టూడియోను పరిశీలించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలపై మాత్రమే ఆధారపడకుండా యువత వ్యాపార రంగాల్లో ముందుకు రావాలని సూచించారు. స్వయం ఉపాధి ద్వారా వ్యక్తిగత అభివృద్ధితో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని అన్నారు. పది మంది యువతకు ఉపాధి కల్పించినందుకు డీకాన్ మోడ్యులర్ ఫ్యాక్టరీ నిర్వాహకులు రోషిని, అనూప్ మిశ్రా, కైతి కొండల్‌రావును అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, ప్రముఖులు పాల్గొన్నారు



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
12.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**2026 టీ20 వరల్డ్ కప్ విన్నర్స్ రేసు**

డిఫెండింగ్ ఛాంపియన్‌గా, సొంతగడ్డపై ఆడుతున్న భారత్ ఈ రేసులో అందరికంటే ముందుంది. అయితే ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి జట్ల నుండి భారత్‌కు గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది.








# డబుల్ ధమాకా

- రెండు సూపర్ ఓవర్ల యుద్ధం..
- ఉత్కంఠ పోరులో దక్షిణాఫ్రికా వీరోచిత విజయం!
- పోరాడి ఓడిన అఫ్గాన్
- క్రికెట్ చరిత్రలో నిలిచిపోయే 'నరాలు తెగే' సమరం!
- వణుకు పుట్టించిన అఫ్గాన్.. తృటిలో చేజారిన గెలుపు
- సీజన్ లో 'ది బెస్ట్' మ్యాచ్!

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

టీ20 వరల్డ్ కప్‌లో అరుదైన ఉత్కంఠభరిత పోరు అభిమానులను కుర్చీలకు అతుక్కుపోయేలా చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా-ఆఫ్ఘనిస్తాన్ జట్లు చివరి బంతి వరకు పోరాడి నరాలు తెగే మ్యాచ్‌ను అందించాయి. ఈ సీజన్‌లోనే అత్యుత్తమ పోరుగా నిలిచిన ఈ మ్యాచ్ డబుల్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది.

మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా ఆరు వికెట్లకు 187 పరుగులు చేసింది. రికెల్టన్ 61, డికాక్ 59 పరుగులతో రాణించారు. ఆఫ్ఘనిస్తాన్ తరఫున ఒమర్ జాయ్ మూడు, రషీద్ ఖాన్ రెండు వికెట్లు తీశారు.

లక్ష్యచేదనలో ఆఫ్ఘనిస్తాన్ 19.4 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌట్ అయింది. గుర్బాజ్ 84 పరుగులతో పోరాడాడు. చివర్లో ఫారూకి రన్ అవుట్ కావడంతో మ్యాచ్ టైగా ముగిసింది.

**మొదటి సూపర్ ఓవర్**

మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ 17 పరుగులు చేసింది. అజ్మత్ దూకుడుగా ఆడగా గుర్బాజ్ సహకరించాడు. లక్ష్యంతో దిగిన దక్షిణాఫ్రికా చివరి బంతికి సిక్సర్ సాధించడంతో స్కోరు సమమైంది.

**రెండో సూపర్ ఓవర్**

మరోసారి సూపర్ ఓవర్ నిర్వహించారు. ఈసారి ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 23 పరుగులు చేసింది. స్టబ్స్, మిల్లర్ సిక్సర్లతో విరుచుకుపడ్డారు.

23 పరుగుల లక్ష్యంతో దిగిన ఆఫ్ఘనిస్తాన్‌కు మహారాజ్ గట్టి దెబ్బకొట్టాడు. తొలి రెండు బంతుల్లోనే వికెట్ సాధించాడు. గుర్బాజ్ వరుస సిక్సర్లతో ఆశలు రేపినా చివరి బంతికి అవుట్ కావడంతో ఆఫ్ఘనిస్తాన్ పోరాటం ముగిసింది. నాలుగు పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసింది. ఈ డబుల్ సూపర్ ఓవర్ పోరు టీ20 వరల్డ్ కప్ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించింది.

# ఇదేం విసురుడు...

- పాక్ క్రికెటర్ ఉస్మాన్ తారిక్ బౌలింగ్‌పై అనుమానాలు
- ఐసీసీకి ఫ్యాన్స్ ప్రశ్నలు

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

పాకిస్థాన్ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ బౌలింగ్ శైలి క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అతని యాక్షన్ త్రో బౌలింగ్‌లా కనిపిస్తోందని అభిమానులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. బంతి వేయడానికి ముందు చేతిని ఆపి వేయడం గల్లీ క్రికెట్‌ను తలపిస్తోందని సోషల్ మీడియాలో కామెంట్లు వస్తున్నాయి. టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా అమెరికాతో కొలంబోలో జరిగిన మ్యాచ్‌లో తారిక్ 3/27తో రాణించాడు. అతని వినూత్న శైలి అమెరికా బ్యాటర్లను ఇబ్బంది పెట్టింది. అయితే ప్రదర్శన కంటే యాక్షన్‌పైనే చర్చ ఎక్కువైంది. అతని బౌలింగ్‌ను పరీక్షించాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు.

**అనుమానాల మధ్య స్పష్టత**

ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియా సిరీస్‌లోనూ అతని యాక్షన్‌పై చర్చ జరిగింది. మిస్టరీ స్పిన్నర్‌గా పేరున్న తారిక్ బంతి విడుదలకు ముందు చేతులను విభిన్న కోణాల్లో తిప్పడం, స్వల్ప విరామంతో వేయడం అతని ప్రత్యేకత. ఈ 'హెజిటేషన్' వల్ల బ్యాటర్ల టైమింగ్ దెబ్బ తింటోంది.

ఐసీసీ నిబంధనల ప్రకారం బంతి విడుదల సమయంలో చేయి 15 డిగ్రీలకంటే ఎక్కువ వంగకూడదు. తారిక్ యాక్షన్‌లో ఆ పరిమితి దాటలేదని ప్రాథమిక పరిశీలనల్లో తేలడంతో అతనికి అనుమతి ఇచ్చినట్లు సమాచారం.



# భారత్.. నా బౌలింగ్‌కు భయపడుతోంది: ఉస్మాన్ తారిక్

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్



అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో 3/27తో రాణించిన పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ తన బౌలింగ్‌పై వస్తున్న విమర్శలకు స్పందించాడు. భారత అభిమానులు తన యాక్షన్‌ను ఎక్కువగా చర్చించడం వారి భయానికే సంకేతమని వ్యాఖ్యానించాడు. తన బౌలింగ్ చూసి ఒత్తిడికి గురవుతున్నారని, ప్రస్తుతం ఒత్తిడి తమపై కాకుండా భారత్‌పైనే ఎక్కువగా ఉందని పేర్కొన్నాడు.

తారిక్ బౌలింగ్ శైలి త్రోలా కనిపిస్తోందని సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. బంతి విడుదలకు ముందు చేతిని విభిన్న కోణాల్లో తిప్పడం, స్వల్ప విరామంతో వేయడం అతని ప్రత్యేకత. ఈ 'హెజిటేషన్' వల్ల బ్యాటర్ల టైమింగ్ దెబ్బతింటుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే మీడియా చర్చలపై పట్టించుకోనని, తన దృష్టి పూర్తిగా ఆట, ప్రాక్టీస్‌పైనే ఉందని తారిక్ స్పష్టం చేశాడు.

# కాంట్రాక్ట్ కత్తెర: ఐదుగురు స్టార్లకు బీసీసీఐ గుడ్‌బై

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

202526 సీజన్‌కు సంబంధించిన టీమిండియా వార్షిక కాంట్రాక్టుల జాబితాను బీసీసీఐ ప్రకటించింది. ఈసారి సెలెక్షన్ కమిటీ కఠిన నిర్ణయాలతో ముందుకొచ్చింది. గత ఏడాది ఒప్పందంలో ఉన్న ఐదుగురు ప్రముఖ ఆటగాళ్లను పూర్తిగా పక్కన పెట్టింది. మొత్తం కాంట్రాక్ట్ పొందిన వారి సంఖ్యను 34 నుంచి 30కి తగ్గిస్తూ, ప్రదర్శన ఆధారంగానే అవకాశాలు ఉంటాయని స్పష్టం చేసింది.

**షమీ, ఇషాన్‌కు చోటు లేకుండా**

ఈ జాబితాలో మహ్మద్ షమీ, ఇషాన్ కిషన్ పేర్లు లేకపోవడం చర్చనీయాంశమైంది. గతంలో గ్రేడ్ ఏలో ఉన్న షమీ గాయాల కారణంగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత జట్టులోకి రాకపోవడం అతనిపై ప్రభావం చూపింది.

ఇషాన్ కిషన్ కూడా గత కొంతకాలంగా జట్టుకు అందుబాటులో లేకపోవడం, అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడకపోవడం వల్ల ఒప్పందాన్ని కోల్పోయాడు.

**సర్ఫరాజ్, పటీదార్‌కు నిరాశ**

దేశవాళీ క్రికెట్‌లో రాణించి జాతీయ జట్టులోకి వచ్చిన సర్ఫరాజ్ ఖాన్ ఈసారి కాంట్రాక్ట్ జాబితాలో లేదు. లభించిన అవకాశాలను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టుకోలేకపోవడం అతనికి మైనస్‌గా మారింది. ముఖ్యంగా టెస్ట్ సిరీస్‌లో ఆశించిన ప్రదర్శన చేయలేకపోయాడు.

రజత్ పటీదార్ కూడా జట్టులో తన స్థానాన్ని స్థిరపరచుకోలేకపోవడంతో ఈసారి ఒప్పందం దక్కలేదు.

**యువ బౌలర్ల పోటీలో ముఖేష్ వెనుకబాటు**

పేసర్ ముఖేష్ కుమార్ గత సీజన్‌లో అవకాశాలు పొందినా ఈసారి జాబితాలో చోటు దక్కలేదు. అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా వంటి యువ బౌలర్లు మెరుగైన ప్రదర్శన చేయడం వల్ల పోటీ పెరిగింది. ఈ నేపథ్యంలో ముఖేష్ స్థానం కోల్పోయాడు.

**ప్రదర్శనకే ప్రాధాన్యం**

తాజా కాంట్రాక్టులతో బీసీసీఐ స్పష్టమైన సంకేతం ఇచ్చింది. గత విజయాలు లేదా సీనియారిటీ కంటే ప్రస్తుత ఫామ్, ఫిట్‌నెస్, జట్టుకు అందుబాటులో ఉండటమే కీలకమని తెలిపింది. రాబోయే కాలంలో జట్టులో స్థానం కోసం పోటీ మరింత కఠినంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.




# నమీబియా మ్యాచ్ కు అభిషేక్ శర్మపై డౌటే?!

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

టీ20 ప్రపంచకప్ 2026లో నమీబియాతో గురువారం జరిగే కీలక మ్యాచ్‌కు ముందు టీమిండియాలో కలవరం నెలకొంది. స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో అతని ఆడటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు ఆయన గైర్హాజరు కావడం ఆందోళనను మరింత పెంచింది. అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో అనారోగ్యంతోనే ఆడిన అభిషేక్, తరువాత ఫీల్డింగ్‌కు రాలేకపోయాడు.

అభిషేక్ అందుబాటులో లేకపోతే సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ రేసులో ఉన్నారు. నెట్స్‌లో సంజూ సుదీర్ఘంగా సాధన చేయగా, ఇషాన్ దూకుడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. జట్టు మేనేజ్మెంట్ మాత్రం తొందరపడదలచుకోలేదని, పాకిస్థాన్‌తో జరిగే హై-వోల్టేజ్ మ్యాచ్ నాటికి అభిషేక్ పూర్తి ఫిట్‌గా ఉండేలా చూడటమే లక్ష్యమని కోచింగ్ సిబ్బంది స్పష్టం చేశారు.



# ఐర్లాండ్‌పై ఆసీస్ సునామీ..

- 67 పరుగుల తేడాతో ఘన విజయం

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

టీ20 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా దూకుడు కొనసాగుతోంది. ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 67 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి గ్రూప్ దశలో తమ ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. సాధారణ కెప్టెన్ మిచెల్ మార్ష్ గాయంతో దూరంగా ఉండటంతో ట్రావిస్ హెడ్ జట్టును నడిపించాడు. టాస్ గెలిచిన ఆసీస్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుని ఆరంభంలో వికెట్లు కోల్పోయినా, కెమెరాన్ గ్రీన్-జోష్ ఇంగ్లిస్ జోడీ పవర్‌ప్లేలో జట్టును నిలబెట్టింది. తరువాత మార్కస్ స్టోయినిస్, మ్యాట్ రెన్షా కీలక భాగస్వామ్యం నమోదు చేయగా, చివర్లో బార్ట్లెట్, కాన్నోలీ వేగంగా పరుగులు సాధించి స్కోరును 180 దాటించారు.

లక్ష్య ఛేదనలో ఐర్లాండ్‌కు ఆరంభంలోనే దెబ్బ తగిలింది. కెప్టెన్ పాల్ స్టర్లింగ్ గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా వెళ్లిపోవడం జట్టును ఒత్తిడిలోకి నెట్టింది. మధ్యలో కొన్ని మెరుపులు మెరిపించినా, ఆస్ట్రేలియా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి వికెట్లు వరుసగా తీశారు. స్పిన్నర్లు మధ్య ఓవర్లలో మ్యాచ్‌ను పూర్తిగా తమవైపు తిప్పగా, ఐర్లాండ్ 115 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ విజయంతో ఆస్ట్రేలియా టైటిల్ రేసులో మరింత బలంగా కనిపిస్తోంది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
12.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## తొలి షాట్‌ను గుర్తు చేసుకున్న చిరంజీవి

నటన, నృత్యం, ఫైట్స్‌తో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించిన చిరంజీవి ఇప్పటికీ అదే ఉత్సాహంతో కొనసాగుతున్నారు. 70 ఏళ్ల వయసులోనూ యువ హీరోలకు సవాల్ విసురుతూ స్క్రీన్‌పై మెరిసిపోతున్నారు.

చిరంజీవి కెరీర్ ప్రారంభ దశను ఆయన తాజాగా గుర్తుచేసుకున్నారు. తొలి చిత్రం 'పునాదిరాళ్లు' కోసం జీవితంలో మొదటి సారి కెమెరా ముందుకు వచ్చిన రోజు తనకు ఎంతో ప్రత్యేకమని ఎక్స్‌లో భావోద్వేగంగా పేర్కొన్నారు. ఆ రోజున కలిగిన ఆత్రుత, ఆనందం, బాధ్యతాభారతం ఇప్పటికీ స్పష్టంగా గుర్తున్నాయని తెలిపారు. తనకు అవకాశం ఇచ్చిన దర్శకుడు, నిర్మాతల పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రేక్షకుల ఆదరణే తన ప్రయాణానికి బలమని పేర్కొన్నారు.

**చిన్న ఆలోచన.. పెద్ద ప్రశంస**

1978 ఫిబ్రవరి 11న 'పునాదిరాళ్లు' చిత్రానికి సంబంధించిన ఓ సన్నివేశం చిత్రీకరణ సందర్భంగా జరిగిన సంఘటనను చిరంజీవి ఓ సందర్భంలో పంచుకున్నారు. స్నేహితులతో కలిసి నీటి తొట్టి దగ్గర కాళ్లు కడుక్కొని భోజనానికి వెళ్లే సీన్‌లో ఆయన చివరగా నిలబడి ఉండాల్సి వచ్చిందని తెలిపారు. ఆ సన్నివేశానికి ముందు పాత్రలు పొలంలో గడ్డి కోసి వస్తారనే విషయం తెలుసుకున్న ఆయన, నిజంగా గడ్డి తీసుకుని ఒంటిపై వేసుకుని షాట్‌కు వచ్చారు. కెమెరా ఆన్ అయిన తర్వాత గడ్డిని తొలగిస్తూ నటించారని చెప్పారు.

ఈ విషయాన్ని గమనించిన కెమెరామెన్ పీఎస్ నివాస్ ఆయనను పిలిచి పేరు అడిగి, పాత్రకు అనుగుణంగా ఆలోచించిన తీరు మెచ్చుకున్నారని తెలిపారు. ఆ ప్రశంస తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని పేర్కొన్నారు. ప్రతి సినిమాలో పాత్ర పరిధిలో ఎంత ప్రత్యేకంగా కనిపించగలమనే ఆలోచనతో ముందుకు సాగుతానని, ముందు వరుసలోనైనా వెనుక వరుసలోనైనా తనకంటూ గుర్తింపు ఉండాలనే ప్రయత్నం చేస్తానని చెప్పారు.



## ఇక డాక్టర్ శ్రీలీల

**మెడిసిన్ పట్టా అందుకున్న టాలీవుడ్ హీరోయిన్**

టాలీవుడ్‌లో యంగ్ హీరోయిన్లలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల మరో అరుదైన విజయాన్ని అందుకుంది. వెండితెరపై వరుస సినిమాలతో ఆకట్టుకుంటున్న ఆమె, తాజాగా MBBS చదువు పూర్తి చేసి మెడిసిన్ పట్టా స్వీకరించింది. కాన్వొకేషన్ కార్యక్రమంలో డిగ్రీ అందుకున్న సందర్భానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. సినిమాలతో ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా చదువును విస్మరించకుండా ముందుకు సాగడం ఆమె ప్రత్యేకతగా నిలిచింది. షూటింగ్‌ల మధ్య దొరికిన సమయాన్ని వినియోగించుకుని చదువుపై దృష్టి కేంద్రీకరించడంతో లక్ష్యాన్ని సాధించింది. తన తల్లి డాక్టర్ స్వర్ణలతను ఆదర్శంగా తీసుకుని వైద్య విద్యను ఎంపిక చేసుకున్న శ్రీలీల, చిన్ననాటి అనుభవాలే ఈ నిర్ణయానికి కారణమని చెప్పిన సందర్భాలున్నాయి. కుటుంబంలో ఎదురైన ఆరోగ్య సమస్యలు తనలో వైద్యురాలిగా సేవ చేయాలనే సంకల్పాన్ని పెంపొందించాయని ఆమె వెల్లడించింది. ఇప్పుడు ఆ కల సాకారమై, అధికారికంగా డాక్టర్‌గా గుర్తింపు పొందింది.



## 'స్వయంభు' టీజర్ విడుదల..

- **యోధుడిగా నిఖిల్**

యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న భారీ పీరియడ్ యాక్షన్ చిత్రం 'స్వయంభు'పై ఆసక్తి పెరుగుతోంది. సమ్మర్ సందర్భంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో 3D ఫార్మాట్‌లో రూపొందించిన ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ కథ క్రీస్తుశకం 985 కాలం నేపథ్యంగా సాగుతుంది. ఆ యుగానికి చెందిన వీరయోధుడిగా నిఖిల్ పాత్రను తీర్చిదిద్దారు. విస్తృతమైన సెట్స్, యుద్ధ సన్నివేశాలు, నిఖిల్ కొత్త రూపం టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

సంయుక్త మీనన్, నభా నటేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. సంగీతాన్ని రవి బస్రూర్ అందిస్తుండగా, ఛాయాగ్రహణం కె.కె. సెంథిల్ కుమార్ నిర్వహించారు. 'కార్తికేయ 2' విజయానంతరం నిఖిల్ చేస్తున్న ఈ చిత్రంపై టాలీవుడ్‌తో పాటు ఇతర భాషల్లో కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి.

## ముత్యాల మెరుపుల్లో దుబాయ్‌లో కృతి సనన్

**బాలీవుడ్ నటి కృతి సనన్ దుబాయ్‌లో నిర్వహించిన ప్రత్యేక ఈవెంట్‌లో తన స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంది. వైట్ టోన్‌లో మెరిసిన ఆమె అవుట్‌ఫిట్‌కు ముత్యాల అద్దకం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రిస్టిన్ వైట్ టూ-పీస్ డ్రెస్సులో కృతి మెరిసింది. గ్లామరస్ నెక్‌లైన్, సన్నని స్ట్రాప్స్‌తో ఉన్న డెలికేట్ బ్రాలెట్‌కు హై వెయిస్టెడ్ మ్యాక్సీ స్కర్ట్‌ను జత చేసింది. శరీరాకృతిని హైలైట్ చేస్తూ కింద భాగంలో ఫిష్‌టెయిల్ హేమ్‌లైన్‌తో ఫ్లోయింగ్ లుక్ ఇచ్చింది. నడిచేటప్పుడు స్కర్ట్ ఇచ్చిన మోషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డ్రెస్ అంతటా అలంకరించిన పర్ల్ చైన్ వర్క్ అవుట్‌ఫిట్‌కు రిచ్ ఫినిష్ ఇచ్చింది. వైట్ కలర్‌కు కాంట్రాస్ట్‌గా గ్రీన్ ఎమరాల్డ్ స్టేట్‌మెంట్ ఇయరింగ్స్, మ్యాచింగ్ రింగ్స్ ధరించి లుక్‌ను పూర్తి చేసింది. గ్లామర్, ఎలిగెన్స్ కలయికగా కనిపించిన ఈ స్టైల్‌తో కృతి మరోసారి ఫ్యాషన్ ప్రేమికుల దృష్టిని ఆకర్షించింది.**






## టెన్నిస్ కోర్టులో స్టైలిష్ లుక్‌తో సిమ్రన్ చౌదరి

**యువ నటి సిమ్రన్ చౌదరి తాజా ఫోటోషూట్‌తో ఆకట్టుకుంది. స్పోర్టీ థీమ్‌తో నిర్వహించిన ఈ షూట్‌లో ఆమె ఉత్సాహభరితమైన పోజులతో మెరిసింది. ఓపెన్ కోర్ట్ నేపథ్యంలో తీసిన చిత్రాలు సోషల్ మీడియాలో దృష్టి ఆకర్షిస్తున్నాయి. లైట్ బ్లూ ఫిట్ చేసిన క్రాప్ టాప్‌కు వైట్ లేయర్డ్ స్కోర్ట్ జతచేసి స్టైలిష్ స్పోర్ట్స్ లుక్‌ను అందుకుంది. కదులుతూ, జంప్ చేస్తూ ఇచ్చిన పోజుల్లో ఆమె ఉత్సాహం స్పష్టంగా కనిపించింది. చేతులపై జారిన వైట్ శ్రగ్, గ్రీన్-వైట్ స్నీకర్స్ ఆ లుక్‌ను పూర్తి చేశాయి. సాధారణ పోనీటైల్ హెయిర్ స్టైల్, మినిమల్ మేకప్‌తో నేచురల్ గ్లోను మెరిపించింది. ఫిట్‌నెస్, ఫ్యాషన్ కలయికగా కనిపించిన ఈ ఫోటోషూట్‌లో సిమ్రన్ నమ్మకంగా, ఫ్రెష్‌గా కనిపించింది.**

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com